ప్రజాశక్తి

గురువారం 18 డిసెంబర్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

వ్యవసాయ పురోగతి మందగమనం

- పర్యాటకం రంగం, ఫైళ్ల క్లియరెన్స్‌పై దృష్టి పెంచాలి
- బొల్లాపల్లి, నూజెండ్లలో భూగర్భ జలాల పెరుగుదల
- రాష్ట్ర అనుసంధాన పథకాల అమలులో పల్నాడు ప్రథమం



సదస్సులో పల్నాడు, గుంటూరు జిల్లాల కలెక్టర్లు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లాలో వ్యవసాయ రంగం పురోగతి మందగమనంగా ఉందని బాగా మెరుగుపడాలని జిల్లా కలెక్టర్‌కు సిఎం చంద్రబాబు సూచించారు. వెలగపూడిలో రెండ్రోజులపాటు నిర్వహించిన సదస్సులో సిఎం మాట్లాడగా గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు తమీమ్ అన్సారియా, కృతికా శుక్లా హాజరయ్యారు. గుంటూరు జిల్లాకు సంబంధించి పలు అంశాలపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇచ్చిన నివేదికలను సిఎం ప్రస్తావిస్తూ కీలకమైన వ్యవసాయ రంగం పురోగతి బాగాలేదన్నారు. ఆశించిన విధంగా వృద్ధిరేటు పెరగడం లేదన్నారు. గతంలో పారిశ్రామిక వేత్తలతో కుదిరిన ఎంవోయుల అమలుపైనా కలెక్టర్ శ్రద్ధ పెట్టాలన్నారు. ఫైళ్ల క్లియరెన్సులో జాయింట్ కలెక్టర్ల బాగా వెనుకబడి ఉంటున్నారని, గుంటూరు జెసి శ్రీవాస్తవ ఒక్కో ఫైలు క్లియరెన్సుకు ఐదారు రోజులు తీసుకుంటున్నారని ఉన్నతాధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఈ అంశాన్ని సిఎం ప్రస్తావించడంతోపాటు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఫైళ్లను వేగంగా క్లియర్ చేస్తున్నారని చెప్పారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. వివిధ ప్రాజెక్టులకు భూ సేకరణ అంశాలనూ చర్చించారు.

రాష్ట్ర అనుసంధాన పథకాల అమలులో పల్నాడు జిల్లా అగ్రస్థానంలో ఉందని అభినందించారు. 47 పథకాలకు సంబంధించి 91 శాతం నిధులు ఖర్చు చేసి 26 జిల్లాల్లో అగ్రస్థానం పొందిందని, 47 రాష్ట్ర అనుసంధాన పథకాలకు సంబంధించి మొత్తం రూ.167 కోట్లకు గానూ జిల్లాలో రూ.151 కోట్లు లబ్ధిదారులకు నేరుగా చేర్చారని చెప్పారు. అయితే

▶ 2లో

ఉపాధి చట్టం నిర్వీర్యంపై 20న నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధి హామీ చట్టం పీకనొక్కేందుకు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లులను ఉపసంహరించుకోవాలని ఈనెల 20న అన్ని మండలాలు, గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం, కౌలు రైతు సంఘం, సిఐటియు జిల్లా కమిటీలు పిలుపునిచ్చాయి. బుధవారం ఆయా సంఘాల సమావేశ అరండల్‌పేటలో నిర్వహించారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఇ.అప్పారావు, కౌలురైతు సంఘం జిల్లా నాయకులు పాశం రామారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో పేదలకు ఉపాధి కల్పిస్తూ, గ్రామీణ ప్రజల స్వావలంబనకు దోహదం చేస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు. చట్టానికి ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించి వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవక మిషన్ పేరుతో మార్చుతూ బిల్లు ప్రవేశపెట్టారన్నారు. ఇప్పటి వరకూ ఈ చట్టంలో 90 శాతం నిధులు కేంద్రం భరిస్తే 10 శాతం రాష్ట్రం భరిస్తుందని, నూతన బిల్లు ప్రకారం కేంద్రం 60 శాతమే ఇస్తుందని, మిగిలిన 40 శాతం రాష్ట్రం భరించాల్సి ఉంటుందని చెప్పారు. తద్వారా రాష్ట్రాలపై భారం మోపి,

▶ 2లో



సమావేశంలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

రాజధానిలో క్వారీలు

అనంతవరంలో ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం అనంతవరంలో క్వారీల ఏర్పాటుపై అధికారులు బుధవారం గ్రామసభ నిర్వహిం చారు. పర్యావరణం సంబంధిత అంశాలపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ అధికారులు సభ ఏర్పాటు చేశారు. అనంతవరంలో కుర్ర జోగేశ్వరరావు 6 హెక్టార్లుల్లో (హెక్టారుకు రెండున్నర ఎకరాలు), పూష్యా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ 8.160 హెక్టార్లలో కంకర, గ్రావెల్ సేకరణకు క్వారీల ప్రతిపాదనలను గ్రామస్తుల ముందుంచారు. గ్రామస్తులు పలు అంశాలను లేవనెత్తారు. గ్రామ అవసరాలకు ఉచితంగా మట్టినివ్వాలని, క్వారీల్లో పెద్ద శబ్దాలు వచ్చేలా బాంబులు వాడకూడదని, స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, రోడ్లపై దుమ్ము రేగకుండా నిత్యం నీళ్లతో తడపాలని, పర్యావరణ పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ అంశాలను అధికారులు నమోదు చేసుకున్నారు. డిఆర్ఒ ఎన్ఎస్‌కె ఖాజావలి, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ ఎమ్‌డి నజీనా బేగం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పుడా చైర్మన్‌గా మధుబాబు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (పుడా) చైర్మన్‌గా చిరుమామిళ్ల మధుబాబు ప్రమాణ స్వీకారం చేశారు. నరసరావుపేట పట్టణంలోని పురా కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరై మధుబాబును అభినందించారు. ఈ సందర్భంగా చిరుమామిళ్ల మధుబాబు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి, పట్టణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు, నగర ప్రణాళికల అమలుకు మధుబాబు నిరంతరం కృషి చేస్తారనే నమ్మకం ఉందన్నారు.





మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

రైతులను సంఘటితం చేసేందుకు కార్యాచరణ

జనవరి 29 నుంచి నాలుగు రోజులపాటు గుంటూరులో ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశంలో వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుందని, దీన్ని నిలబెట్టుకునేందుకు రైతులను సంఘటిత పరిచేలా ఉద్యమాలు రూపొందించాలని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఇందుకు కోసం కార్యాచరణపై గుంటూరులో జనవరి 29, 30, 31, ఫిబ్రవరి ఒకటవ తేదీన జరిగే అఖిలభారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ సమావేశాల్లో చర్చించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు గుంటూరులోని గీతా రెసిడెన్సిలో బుధవారం వివిధ రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ వ్యవసాయం క్రమంగా కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి పోతున్న తరుణంలో దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ నాయకులు ఈ సమావేశానికి హాజరై తీసుకోనున్న నిర్ణయాలు తీర్మానాలు కీలకంగా మారనున్నాయని చెప్పారు. పంటలకు ధరల్లేకుండా వినియోగదారులపై అదనపు భారం మోపే విధంగా జరుగుతున్న ఒక పెద్ద

పంటల్ని దెబ్బతీసిన వానలు, తెగుళ్లు
ప్రాణం తీసుకున్న యువ కౌలురైతు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

తొలుత దెబ్బతీసిన మొంథా తుపాను, ఆపై తెగుళ్లు, ఇవి చాలవన్నట్లు వరుసగా రెండు వాయుగుండాల వల్ల పడిన వానలు వెరసి రైతులను అప్పుల్లో ముంచాయి. వాటిని తీర్చాలనే ఒత్తిళ్లూ పెరగడంతో రోజులతరబడి సతమతమైన యువ కౌలురైతు చివరికి ఆత్మహత్య చేసుకున్నాడు. ఫిరంగిపురం మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన మర్రి బొల్లయ్యకు మూడెకరాల పొలం ఉండగా మరో 11 ఎకరాలను కౌలుకు తీసుకున్నాడు. 9 ఎకరాల్లో పత్తి, నాలుగెకరాల్లో మిర్చి సాగు చేశాడు. కౌలు నిమిత్తం ఎకరాకు రూ.20-25 వేలు చొప్పున ముందుగానే చెల్లించాడు. పత్తి పైరు కాయ దశలో, మిర్చి పైరు మధ్య దశలో ఉండగా వాటిపై మొంథా తుపాను విరుచుకుపడింది. మిర్చి పైరు ఉరకెత్తగా పత్తి కాయలు

▶ 2లో



ప్రదర్శన ఇస్తున్న దప్పు కళాకారులు

అబ్బురపరిచిన జానపద సాంస్కృతిక సంబరాలు

ఉపాధ్యాయులు, కళాకారులకు నాట్స్ పురస్కారాలు

ప్రజాశక్తి-గుంటూరు

నార్త్ అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం నిర్వహించిన జానపద సాంస్కృతిక సంబరాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ రకాల జానపద కళలను ఒకే వేదికపై ప్రదర్శించి అబ్బురపరిచారు. అమలాపురం నుండి గరగనృత్యం ఆకట్టుకుంది. నృత్యంలో భాగంగా బ్లేడులను గొంతులో మింగి, దారంతో బయటకు తీసే దృశ్యం ఒళ్లు గగుర్పొడిచే విధంగా ఉంది.

▶ 2లో



ఎఎస్ఐ, హోం గార్డులకు ఎస్పి అభినందనలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మారథాన్ (21కి.మీ,32 కి.మీ.) పరుగు పందేలలో పతకాలు సాధించిన ఎఎస్ఐ రాజశేఖర్, హెూంగార్డు కిషోర్‌ను జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ అభినందించారు. గత నెల 30వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించిన "సంధ్య మెరైన్స్ వైజాగ్ మారథాన్ - 2025" అనే పరుగు పందెంలో నల్లపాడు పోలీస్ స్టేషన్లో ఏఎస్సైగా పనిచేస్తున్న రాజశేఖర్ బాబు 21 కి.మీ. పరుగు పందెంను 2.15 గంటల వ్యవధిలో, జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డ్ గా పనిచేస్తున్న జి. కష్ణ కిషోర్ 32 కి.మీ. పరుగు పందెంను కేవలం 3.28 గంటల వ్వవధిలో పూర్తి చేసి మెడల్స్ సాధించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కూచిపూడి నృత్య శిక్షణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ఐటీ,విద్యా శాఖల మంత్రి వర్యులు, మంగళగిరి శాసన సభ్యులు నారా లోకేష్ ఆదేశాలమేరకు బాల్ కార్పొరేషన్, అనంత ఆనంద ట్రస్ట్ సహకారం తో ఇకపై మంగళగిరి ప్రభుత్వ పాఠశాలలో కూచిపూడి న అత్యం నేర్పించుటకు చర్యలు చేపడుతున్నారు.నియోజకవర్గంలో ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఎక్కువగా ఉన్న కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి వారంలో ఒకరోజు కూచిపూడి న అత్యం నేర్పనున్నారు. విద్యార్థులు చదువుతో పాటు కళలలో కూడా రాణించడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమని ఆ లక్ష్యానికి అనుగుణంగా బాల్ కార్పొరేషన్, అనంత ఆనంద ట్రస్ట్ లు పనిచేస్తాయని ట్రస్ట్ సభ్యులు బుధవారం తెలిపారు.



చీడ పీడలను గుర్తించే యాజమాన్య బులెటన్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాడికొండ

రైతులు క్షేత్ర స్థాయిలో చీడ పీడలను గుర్తించి, సరైన యాజ్యమన్య చర్యలు చేపట్టే విధంగా శాస్త్రవేత్తలు రూపొందించిన బులెటన్ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆచార్య ఎన్జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డా ఆర్ శారద జయలక్ష్మి దేవి అన్నారు.గురువారం ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ప్రొద్దుతిరుగుడు, కుసుమ, వరిశలు, నువ్వులు, ఆముదం, ఆవాలు, సోయాబీన్ పంటలను ఆశించు చీడ పీడల నిర్ధారణకు యాజ్యమన్యం మరియు వివిధ పంటలలో సమగ్ర కలుపు యాజ్యమన్యం పై మూడు బుల్లెటిన్లను ఉపకులపతి డా.ఆర్. శారద జయలక్ష్మి దేవి, విశ్వ విద్యాలయ అధికారులు విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుల్లెటిన్ల రూపకల్పన లో భాగ్యస్వామ్యులైన శాస్త్రవేత్తలను అభినందించారు. రైతు సోదరులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని మంచి దిగిబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయ అధికారులు మరియు వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం శాస్త్రవేతలు పాల్గొన్నారు.

రైతులను సంఘటితం చేసేందుకు కార్యాచరణ

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేట్ మాఫియాను నియంత్రించేందుకు రైతులు మరో పోరాటానికి సన్నద్ధం కావాలన్నారు. పంటలకు మద్దతు ధరలు ప్రకటించినా అమలు కావడం లేదని, మద్దతు ధరలు రానప్పుడు రైతులు ఆదుకునేందుకు నిధులనూ కేటాయించడం లేదని అన్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమును కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. గత రెండేళ్ల కాలంలో వివిధ పంటలు నష్టపోయిన రైతులకు సాయం అందలేదని, బ్యాంకుల నుంచి తగిన చేయూత కొరవడిందని చెప్పారు. ఏ పంటకూ మద్దతు ధరలు దక్కక దేశవ్యాప్తంగా యువ రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. నల్ల చట్టాలను రైతు ఉద్యమాల వత్తిడి వల్ల వెనక్కు తీసుకున్నా దొడ్డిదారిన అమలు చేస్తోందని విమర్శించారు. కార్మికుల హక్కులను కలరాసేందుకే లేబర్ కోడ్‌లను తెచ్చారన్నారు. రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన ప్రధాని మోడీ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఉన్న సంక్షోభం వల్ల స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ వాటా తగ్గిపోయిందన్నారు. గుంటూరులో జరిగే ఎఐకెఎస్ జాతీయ సమావేశాలకు రైతు సంఘం నాయకులు అశోక్ దావాలే, హనన్ మొల్ల, విజూకృష్ణన్ వస్తారని తెలిపారు. సమావేశంలో రిటైర్డ్ ప్రొఫెసర్ టి.రత్నారావు, కిసాన్ ఫౌండేషన్ అధ్యక్షులు బండ్ల సూరయ్య చౌదరి, లాం ఫారం మాజీ అసోసియేట్ డైరెక్టర్ ఆర్.అంకయ్య, తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణమూర్తి, వివిధ సంఘాల నాయకులు వివికె.సురేష్, మహమ్మద్ చిష్టి, కుమార్, వల్లూరు భారతి, పాశం రామారావు, ఈమని అప్పారావు, ఏపూరి గోపాలరావు, కంచుమాటి అజయ్‌కుమార్, ముత్తవరపు సురేష్ పాల్గొన్నారు.

వ్యవసాయ పురోగతి మందగమనం

(మొదటి పేజీ తరువాయి)

డ్వాక్రా రుణాల మంజూరులో పురోగతి లేదన్నారు. కొన్ని గ్రామాల్లో డ్వాక్రా రుణాల విడుదలలో అవకతవకలు జరిగాయని, బ్యాంకుల్లో రుణాల మంజూరులో అక్రమాలపై చర్చించారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలని సిఎం ఆదేశించారు. జిల్లాలో భూగర్భ జలాల పెరుగుదలపై పల్నాడు కలెక్టర్‌ను సిఎం అడుగగా బొల్లాపల్లి, నూజెండ్ల మండలాల్లో ఇటీవల బాగా పెరిగాయని వివరించారు. పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సిఎం సూచించారు.

ఉపాధి చట్టం నిర్వీర్యంపై 20న నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

క్రమంగా నిర్వీర్యానికి కేంద్రం పూనుకుందని విమర్శించారు. గతంలో వంద రోజుల పని గ్యారంటీని పేదలు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు కల్పించారని, కొత్త బిల్లులో ప్రభుత్వం ఎంపిక చేసిన ప్రాంతాల్లో మాత్రమే అది కూడా 60 రోజులే పని కల్పిస్తారని అన్నారు. వంద రోజుల పనిని 125 రోజులకు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటన చేస్తున్నా అందుకు అవసరమైన నిధులు మాత్రం కేటాయించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానం వల్ల గ్రామీణప్రాంతాల్లో నిరుద్యోగం, పేదరికం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవటానికి పేదలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు, కౌలురైతు సంఘాల జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, బి.రామకృష్ణ, నాయకులు ఎన్.రాజేంద్ర పాల్గొన్నారు.

ప్రాణం తీసుకున్న యువ కౌలురైతు

(మొదటి పేజీ తరువాయి)

కుళ్లిపోయాయి. అయినా పైరును కాపాడుకోవడానికి సిద్ధమైన బొల్లయ్య ఎకరా పత్తికి రూ.5 వేలు, మిర్చికి రూ.30 వేలు చొప్పున ఖర్చు చేసి మందులు వేశాడు. పైరు కోలుకుని ఎదుగుతుందనగా మరోసారి రెండు వాయుగుండాలు వరుసగా వచ్చి మూడేసి రోజుల చొప్పున వానలు పడ్డాయి. మిర్చికి బొబ్బర తెగులూ రావడంతో ఒక్కకోత కూడా కోయకుండా పూర్తిగా వదిలేసుకోవాల్సి వచ్చింది. మరోవైపు పత్తి దిగుబడి దారుణంగా పడిపోయింది. ఎకరాకు అర క్వింటాళ్ చొప్పున రావడంతో అది కూలీ డబ్బులకు కూడా సరిపోని పరిస్థితి ఏర్పడింది.

సాధారణంగా కౌలుకాకుండా ఎకరా మిర్చి సాగుకు రూ.70 వేలు, పత్తికి రూ.30 వేలు చొప్పున పెట్టుబడి ఖర్చవుతుంది. అయితే తుపానులు, వానలు, తెగుళ్ల కారణంగా మిర్చికి రూ.30 వేలు, పత్తికి



రూ.5 వేలు చొప్పున అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. అయినా పంట దక్కపోవడంతో బొల్లయ్యకు రూ.15 లక్షల వరకూ అప్పులయ్యాయి. కొంతకాలంగా అప్పులను తిరిగివ్వాలనే ఒత్తిళ్లు సైతం పెరగడంతో వాటిని ఎలా తీర్చాలనే విషయమై బొల్లయ్య తీవ్రంగా సతమతమవుతున్నాడు. చివరికి ఒత్తిళ్లను తట్టుకోలేక మస్థాపానికి గురైన ఆయన బుధవారం గ్రామ సమీపంలోని పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. అటుగా వెళ్లిన అతని సోదరుడు గోపి గమనించి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు.

ఉపాధి హామీ పేరు మార్పుపై కాంగ్రెస్ నిరసన



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మహనీయులను చరిత్ర నుంచి తొలగించినా ప్రజల మనస్సుల నుంచి తొలగించలేరని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చిలకా విజయ్‌కుమార్ తెలిపారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేరుమార్చుతూ పార్లమెంట్ లో బిల్లు ప్రవేశ పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నాయకులు బుధవారం గుంటూరులో నిరసన తెలిపారు. పార్టీ కార్యాలయం నుంచి ఇమని సెంటర్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన చేశారు. తొలత గాంధీ విగ్రహానికి పూలమాలవేసి సెంటర్లో నిరసన తెలిపారు. విజయ్ మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం పేర్లు మార్చడం తప్పా చేసిందేమీ లేదన్నారు. ఒక పథకం ప్రకారం జాతీయ నాయకులపై విమర్శలు దాడి చేస్తున్నారని ఆరోపించారు. పిసిసి క్రమ శిక్షణా కమిటీ చైర్మన్ లింగంశెట్టి ఈశ్వరరావు, నాయకులు బి.సునీల్, గడ్డం పాల్ విజయ్ కుమార్, ఆర్.జాన్‌బాబు, బి.బ్రాహ్మ య్య, సయ్యద్ జాబిలుల్లా, కె.జవహర్‌బాబు, ఆర్.హనుమత్‌రావు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - తెనాలి

బాల్య వివాహ రహిత జిల్లాగా చేసేందుకు కృషి చేస్తామని చైల్డ్ రైట్స్ అడ్వొకసి ఫౌండేషన్(క్రాఫ్ట్) బృందం చెప్పారు. దేశవ్యాప్తంగా బాల్య వివాహాలను నిర్మూలించే లక్ష్యంతో భారత ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ఇంటెన్సివ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా బుధవారం స్థానిక ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్ లో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భగా క్రాఫ్ట్ బృందం బాల్యవివాహాలతో వచ్చే అనర్ధాలను వివరించి, వివాహ వయసు కచ్చితంగా పాటించాలని చెప్పారు. అలాగే బాల్య వివాహ రహిత సమాజం కోసం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ సోషల్ వర్కర్ షేక్ పర్వీన్ సుల్తానా, ప్రధానోపాధ్యాయిని స్కూల్ హెచ్ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎస్ఆర్ ఆధ్వర్యంలో టై అండ్ డై పై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలోని కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సిఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బి. భబిత తెలిపారు. ఈ సందర్భంగా రూపొందించిన పోస్టర్ ను విసీ కార్యాలయంలో ఇన్చార్జ్ విసీ ఆచార్య కే.గంగాధర్ ఆవిష్కరించారు. డిసెంబర్ 29 నుండి జనవరి 4వ తేదీ వరకు ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని, చదువుతో సంబంధం లేకుండా ఎవ్వరైనా పాల్గొనొచ్చని చెప్పారు. హాజరయ్యేవారు సిఎస్ఆర్ కార్యాలయంలో గాని లేదా 9848286477 ఫోన్ నంబర్‌కుగాని సంప్రదించాలన్నారు.






అబ్బురపరిచిన జానపద సాంస్కృతిక సంబరాలు

(మొదటి పేజీ తరువాయి)

శ్రీకాకుళం జిల్లాకు చెందిన తప్పెటగూళ్ల నృత్యం ఆకట్టుకుంది. భద్రాచలం నుండి గిరిజన కళాకారుల కొమ్ముకోయల నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. కొమ్ములు ధరించి, భారీ డ్రమ్స్ వాయిస్తూ లయబద్ధంగా చేసిన నృత్యం అటవీ గిరిజనుల జీవన విధానాన్ని గుర్తు చేసింది. మలినేని కాలేజి విద్యార్థుల కోలాటం, గుంటూరు జిల్లాకు చెందిన డప్పు కళాకారులు ప్రదర్శనలు అలరించాయి. అనంతరం 36 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందచేశారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర గాయకులు జగన్, ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా కార్యదర్శి, కవి పెద్దిరాజుకు పురస్కారాలు అందచేశారు. ప్రజా గాయకుడు పి.వి.రమణ సాంస్కృతిక కార్యక్రమాలను సమన్వయం చేస్తూ గేయాలు ఆలపించారు. కార్యక్రమంలో చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని, అధ్యక్షులు మందాడి కిరణ్, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ప్రముఖులు వేమూరి శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.ఆంజనేయులు, డాక్టర్ ఈవి నారాయణ, జన చైతన్య వేదిక వి.లక్ష్మణ్‌రెడ్డి, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.







మాట్లాడుతున్న అధికారి

నేటి నుంచి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే

ప్రజాశక్తి - రెంటచింతల

నేటి నుంచి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ప్రారంభం కానున్నట్లు రెంటచింతల ఎంపీడీవో ఎస్. స్వరూప రాణి తెలిపారు. బుధవారం కార్యాలయంలో సచివాలయ అధికారులు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది సర్వేలో పాల్గొని ప్రజలకు సేవలు అందించాలన్నారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై ప్రజలకు సచివాలయ సిబ్బంది అవగాహన కలిగించాలన్నారు. సర్వే జరిగే సమయంలో ప్రజలు కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవో జయబాబు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా

ప్రజాశక్తి - తెనాలి

పిడిఎస్ రైస్ అక్రమ రవాణాను రూరల్ పోలీసులు అడ్డుకున్నారు. వారు తెలిసిన వివరాల ప్రకారం కఠెవరం బ్రిడ్జిపై ఒక డిసిఎం లారీలో 100 బస్తాలు పిడిఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులతో కలిసి వాహనాన్ని అడ్డుకున్నారు. మినీ లారీని సీజ్ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, లారీలో ఉన్న ఇరువురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

పెదరావూరు గ్రామం ఎస్సీ కాలనీలోని ఓ రేషన్ షాప్ నుంచి బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని సమాచారంతో రెవెన్యూ అధికారులతో దాడి చేసి బియ్యం తరలిస్తున్న బొలెరో వాహనాన్ని, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, 19 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్‌స్టేషన్లో గుర్తుతెలియని బాలుడు

ప్రజాశక్తి - తెనాలి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ సాంబశివరావు

హొటల్ వద్ద వదిలి వెళ్ళిన బాలుడిని పట్టణ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేర్చారు. సీఐ ఎస్ సాంబశివరావు మాట్లాడుతూ సుమారు మూడేళ్ల వయసున్న బాలుడిని ఉదయం 9 గంటల సమయంలో స్టేషన్ పరిధిలోని ఓ టీస్టాల్ వద్ద వదిలి వెళ్లారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సిఐ సాంబశివరావు మాట్లాడుతూ బాలుడిని ఉద్దేశపూర్వ కంగా విడిచి వెళ్లి ఉంటే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలా కాకుండా తప్పిపోయి ఉంటే ఫోటో గుర్తించిన వారు తమను సంప్రదిస్తే బాలుడిని తల్లిదండ్రుల వద్దకు చేరుస్తామన్నారు. ప్రస్తుతం ఐసిడిఎస్ అధికారుల ఆధీనంలో బాలుడు ఉంచినట్లు చెప్పారు.

చట్టం తన పని తాను చేసుకుపోతుంది

పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావు

ప్రజాశక్తి - రెంటచింతల

ఘర్షణల వలన ఏమి సాధిస్తారు. వర్గపోరుతో సాధించేది శూన్యం. చిన్న చిన్న విషయాలకు తగాదాలు పెట్టుకుంటే ఎలా అంటూ పల్నాడు జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు ప్రశ్నించారు. బుధ వారం రాత్రి మంచికల్లు గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. మూడు పంటలు పండే ఈ గ్రామంలో తగాదాలు ఎందుకు పెట్టుకుంటు న్నారని ఆగ్రహంగా అడిగారు. ఇలా అయితే మన మీద ఆధారపడే కుటుంబీకులకు ఏమి సమాధానం చెబుతారు... పిల్లలను బాగా చదివించుకుని మంచి భవిష్యత్తును అందించాలి గాని మరో రకంగా ఆలోచనలు చేస్తే చట్టం తన పని తాను పనిచేసుకుపోతుందని ఎస్పీ హితబోధచేశారు. ఇటీవల గ్రామంలో చోటు చేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. ఈ నెల



మంచికల్లు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ

11న ఓ పార్టీకి చెందిన 27 మంది నేతలు 18 నెలలు తరువాత గ్రామంలోకి చేరుకున్నారు. పోలీసు పికెట్ కొనసాగ తున్న సమయంలో ఈ నెల 15న బస్టాప్ వద్ద ముగ్గురు వ్యక్తులపై దాడి చేశారు. ఈ క్రమంలో ఎస్పీ మంచికల్లు సందర్శన ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. కఠినంగా వ్యవహరిసామనీ ఎస్పీ అన్నారు. ఆయన వెంట గురజాల డిఎస్పి బీఎల్ఎన్ జగదీష్, ఎస్ఐ సీహెచ్ నాగార్జున ఉన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే

ప్రజాశక్తి - మాచర్ల

పెన్షన్ ప్రభుత్వాలు ఇచ్చే భిక్షకాదని ప్రతి ప్రభుత్వ ఉద్యోగి హక్కని చాటి చెప్పి, పెన్షనర్ల స్థితిగతుల్ని మార్చ గలి గిన తీర్పును సాధించిన పెన్షన్ పితామహుడు ధనస్వరూప్ నకార పోరాట స్ఫూర్తిని అందుకోవాలని సంఘ రాష్ట్ర కార్య దర్శి గాదె రామకృష్ణారావు అన్నారు. స్థానిక పెన్షన్ హోమ్‌లో జరిగిన పెన్షనర్స్ డే సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి అధ్య క్షత వహించిన మర్రెడ్డి మాట్లాడుతూ ఆధునికకాలంలో పెన్షన్ ప్రమాదంలో పడే పరిస్థితులు వస్తున్నాయనీ, వాటిని అడ్డుకునే పోరాట స్ఫూర్తి అందరికీ రావాలని తెలియజేశారు. సంఘ ప్రధాన సలహాదారులు రామ నాథశర్మ, అల్లి ప్రసాదరావు, మరొక ముఖ్యఅతిథి చందు ఆంజ నేయులు మాట్లాడారు. అధ్యక్షులు నందా నరసింహయ్య, ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, ట్రెజరర్ గాలీబు, జాయింట్ సెక్రెటరీ గౌస్ మొహిద్దీన్, హరినాథ్‌బాబా, కిరీటిరెడ్డి, నారాయణ, లక్ష్మణరావు, ఈశ్వరయ్య, జగన్నాథచార్యులు, నర సయ్య, వెంకటేశ్వర్లు, రాయపరెడ్డి, స్టేట్ బ్యాంక్‌మేనేజర్ సతీష్ కుమార్, రబ్బాని, బిఎల్ఎన్‌శర్మ, చక్రపాణి, వెంకటేశ్వర్లు, సీతారామయ్య, ఐవిఎల్ నరసయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

ఆలిండియా పెన్షనర్ల దినోత్సవం, 18వ వార్షిక సమావేశం సందర్భంగా బుధవారం పెన్షనర్ల సంఘ భవనంలో సంఘ పతాకాన్ని ప్రధాన కార్యదర్శి కాళ్ళ కృష్ణమూర్తి, ఇతర కార్యవర్గ సభ్యులతో ఆవిష్కరించారు. అనంతరం పెన్షనర్ల పితామహుడు డిఎస్ నకరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సహాధ్యక్షులు బి. సుబ్రహ్మణ్యం, జనరల్ సెక్రటరీ కాళ్ళ కృష్ణమూర్తి మాట్లాడారు. విశిష్ట అతిథులుగా ఉప ఖజానా అధికారి బిహెచ్చి శేషసాయి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ పి.కోటేశ్వరరావు పెన్షనర్లకు సంబంధించిన అన్ని సమస్యలను తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, ఈ సి సభ్యులు ఇతర సభ్యులు హాజరయ్యారు.

అన్యాక్రాంతమైన శ్మశాన స్థలాలను గుర్తించండి

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త కొంజేటి నాగశ్రీను రాయల్ ఆధ్వర్యంలో వినుకొండ పట్టణంలోని శ్మశాన వాటికలు ఎన్ని, వాటికి కేటాయించిన స్థల వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా తెలియ చేయా లని వినుకొండ తహసీల్దార్‌కి వినుకొండ మున్సిపల్ మేనేజర్‌కి వినతి పత్రం ఇచ్చారు. అధికారులు స్పందిస్తూ వారి రికార్డులో ఉన్న సమాచారాన్ని తెలియ చేస్తామని తెలిపారు. అనంతరం నాగశ్రీను రాయల్ మాట్లాడుతూ వినుకొండ పట్టణంలో శ్మశానం విషయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తన దృష్టికి రావడంతో ఈ సమస్యను శాసనసభ్యులు జివి ఆంజనేయులు దృష్టికి, ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. కార్యక్రమంలో వినుకొండ పట్టణం జనసేన పార్టీ అధ్యక్షులు పఠాన్ ఈసూబ్, నియోజకవర్గ అధికార ప్రతినిధి పి. అభి మన్యు, పార్టీ నాయకులు నంది కొండలరావు, కె. కిశోర్, తుమ్మ అనిల్ కుమార్, ఇల్లా పోలరాజు, సిద్ధి అనిల్‌కుమార్, శావల్యపురం మండల అధ్యక్షులు అడపాల అనిల్ కుమార్, నడిగడ్డ ఉప సర్పంచ్ వై.రామకృష్ణ, జి.ఆంజనేయస్వామి దేవస్థానం బోర్డు సభ్యులు కె.లక్ష్మణరావు, బి.మండల ఉపాధ్యక్షులు వై. వెంకటేశ్వర్లు , వినుకొండ మండల కార్యదర్శి గణప రమేష్, గోపి పాల్గొన్నారు.

ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ

ప్రజాశక్తి - వెల్దుర్తి



వెల్దుర్తి ఎస్ఐగా సత్యనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటి వరకు వినుకొండ పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెల్దుర్తి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. మండలంలో ఏ సమస్యలున్న తన దష్టికి తీసుకు వస్తే ఆ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా మన్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ సత్యనారాయణ పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు కబడ్డీ జట్టు ఎంపికలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు జరగనున్న పురుషుల కబడ్డీ పోటీల ఎంపికలకు నరసరావు పేట పట్టణం రెడ్డి నగర్‌లోని వశిష్ఠ జూనియర్ కళాశాల వేదిక కానున్నట్లు పల్నాడు జిల్లా అసోసియేషన్ తెలిపింది. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడారు ఈ ఎంపికలలో పాల్గొనే పురుష అభ్యర్థులు 85 కిలోలలోపు బరువు కలిగి ఉండాలని, సెలక్షన్ వచ్చే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని అన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26,27,28 తేదీలలో 3రోజుల పాటు కర్నూలు జిల్లా, పంచలింగాల గ్రామంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ మద్దుల నరేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అభ్యర్థుల ఎంపికకు తమ కళాశాల వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో పల్నాడు జట్టు సత్తా చాటాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొగ్గరంలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని బొగ్గరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఎగ్జిబిషన్) బుధవారం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు మీనగ రామారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో మొత్తం 180 మంది విద్యార్థులు పాల్గొని 154 ప్రాజెక్టులు ప్రదర్శించగా వారిలో ఏడుగురు విజేతలుగా నిలిచారన్నారు.వ్యక్తిగత విభాగంలో ముప్పాళ్ళ జెడ్పిహెచ్ఎస్ విద్యార్థి డి కార్తీక్ సోలార్ ఎనర్జీ, కొండ్రముట్ల జెడ్పిహెచ్ఎస్ విద్యార్థి ఎస్ కార్తీక్ టవర్ ఆఫ్ హానాయ్, గ్రూపు విభాగంలో బొగ్గరం జడ్పిహెచ్ఎస్ విద్యార్థులు ఎం కార్తీక్, జి భార్గవ్ అటాచింగ్ అండ్ డిటాచింగ్ బల్బ్, ఇనుమెల్ల జెడ్పిహెచ్ఎస్ విద్యార్థులు షేక్ సాయి దర్శిత, షేక్ సాదియాబి లు వేస్ట్ మేనేజ్మెంట్, కొచ్చర్ల జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థి రెనెవబుల్ ఎనర్జీ ప్రదర్శనలు బహుమతులు సాధించాయి. మండల సైన్స్ కోఆర్డినేటర్ వి ఎల్ ఎన్ మూర్తి, సెలక్షన్ కమిటీ మెంబర్‌గా ప్రధానోపాధ్యాయులు ఎర్రం హనుమంతరావు, వి నాగేశ్వరరావు, వి.సాంబనాయక్ పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కబడ్డీలో జెడ్‌పి విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలంలో బుచ్చిపాపన్నపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అండర్-14 విభాగం బాలికల విభాగం కబడ్డీ పోటీలలో నరసరావు పేట డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో బుధవారం ప్రథమ స్థానం సాధించిన బాలికల అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 13న నిర్వహించిన బాల మహోత్సవ 2026 కార్యక్రమం సందర్భంగా రసరావు పేట డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలలో అండర్ -14 బాలికల విభాగంలో తమ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని అన్నారు. అనంతరం క్రీడాకారులను అభినందిస్తూ రూ.3 వేలు, కప్, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు జి.నరసింహారావు,ఎల్ ఎఫ్ హెచ్ఎం చైతన్య భారతి, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సిఐటియు జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సిఐటియు అఖిలభారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి ప్రాజెక్టు ఆఫీస్ వద్ద సిఐటియు జెండాను అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఎస్.కె హాజర జెండాను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు పారిశ్రామిక కేంద్రమైన విశాఖపట్నంలో సిఐటియు అఖిలభారత మహాసభలు జరుగుతాయని, చివరి రోజు నాలుగో తేదీ భారీ ప్రదర్శన, ర్యాలీ, ఆర్కే బీచ్‌లో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. సభకు జాతీయ నాయకులు హాజరై కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, కర్తవ్యాల రూపొందిస్తారనీ, ఈ మహాసభలో అంగన్వాడీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. సిఐటియు మండల కన్వీనర్ తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బ్రిటిష్ కాలం నుండి పోరాట సాధించుకున్న 44 కార్మిక చట్టాల రద్దుచేసి, నేడు కేవలం నాలుగు వేతన కోడ్ను తీసుకొచ్చి కార్మికుల శ్రమను కార్పొరేట్లకు దోచి పెడుతుందని ఆయన విమర్శించారు. 8 గంటల పని విధానానికి బదులుగా 12 గంటల పని విధానం తీసుకువచ్చి కార్మికుల శ్రమను పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతుందని మహిళలను



జెండాను ఆవిష్కరిస్తున్న హాజర

నైట్ షిఫ్ట్‌లో పని చేయించుకునేందుకు చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. భవిష్యత్తులో అంగన్వాడీలకు 26000 కనీసం వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీని అమలు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలనీ, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రకరకాల కారణాలతో సెంటర్ విజిట్లు చేయడాన్ని ఆపాలని అంగన్వాడిలపై పని ఒత్తిడి తగ్గించాలనే డిమాండ్లు భవిష్యత్తులో కర్తవ్యాలు నిర్వహిస్తారని వైజాగ్‌లో జరిగే మహాసభకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. అంగన్వాడీలు వెంకటరమణ, రాధారాణి, నాగలక్ష్మి, మనోరమ, భూలక్ష్మికృష్ణ అంజలి, వరలక్ష్మి పాల్గొన్నారు.

హెల్మెటు తప్పనిసరి

ప్రజాశక్తి - వినుకొండ

ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించి డ్రైవ్ చేయాలని వినుకొండ పట్టణ సీఐ ప్రభాకర్ సూచించారు. కొన్ని రోజులుగా నేషనల్ హైవే, మరి కొన్ని రోడ్లపై జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా ట్రాఫిక్ నిబంధనలు పట్టుదిట్టంగా అమలు చేసి రోడ్డు ప్రమాదాలు నియంత్రించుటలో భాగంగా మంగళవారం సిఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో వినుకొండ పట్టణంలో పోలీస్ ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్ చేపట్టారు. హెల్మెట్లు లేకుండా ద్విచక్ర వాహనాలను నడుపు తున్న వారిపై, డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగంగా వెళ్లే వారిని గుర్తించి కేసులు నమోదు చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఎస్బిఐ ప్రభాకర్ ప్రజలతో మాట్లాడుతూ ప్రమాదాలను నివారించడం, ప్రాణనష్టాన్ని తగ్గించి ప్రజా భద్రత కాపాడేందుకు పోలీసులు పని చేస్తున్నారని తెలిపారు. వినుకొండ పట్టణంలో ట్రాఫిక్ జామ్ కాకుండా తగ్గించే చర్యలు తీసుకొని ప్రయాణాన్ని సులభతరం చేస్తున్నామని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

ప్రజాశక్తి-దాచేపల్లి

ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ పాపారావు అన్నారు. దాచేపల్లి సిఐ నేతృత్వంలో పొందుగల చెక్‌పోస్టు వద్ద మంగళవారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

జాతీయ రహదారులపై రోడ్డు భద్రతను మరింత పటిష్టం చేయడానికి హెల్మెట్ లేకుండా జాతీయ రహదారిలో ప్రవేశం లేదనే నిబంధనను ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించబడింది. ఎడ్లపాడు హైవే ప్రవేశ ద్వారం వద్ద రోడ్డు భద్రత అవగాహన చేపట్టారు. కార్యక్రమం లో వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధ నలు పాటించి తమ ప్రాణ భద్రతను కాపాడుకోవాలని కోరారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయంలో ప్రాణాపాయం నుండి బయట పడవచ్చని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.హైమారావు వాహనదారులకు సూచించారు. రోడ్ ప్రమాదాల నివారణలో భాగంగా సత్తెనపల్లి మండలం కంటెపూడిలో వాహనదారులకు బుధవారం అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులపై కేసులు నమోదు చేశారు.వారిచేత ప్రమాణం చేయించారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

ద్విచక్ర వాహనాలు నడిపేవారు హైవేలపై హెల్మెట్ లేకుండా ప్రయాణించరాదని ఎస్సై వెంకటేశ్వరావు అన్నారు. మండలంలోని గణపవరం నూతన బైపాస్ వద్ద బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేస్తే రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎదుర్కొంటారన్నారు. ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించి ప్రయాణం చేయాలన్నారు.

రెండు నెలల్లో పల్నాడుకు హాల్టు

ప్రజాశక్తి - పెదకూరపాడు

రెండు నెలల్లో పల్నాడు ఎక్స్ప్రెస్‌కు హాల్టు కల్పిస్తామని దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ కొంక రాధా హామీ ఇచ్చారు. బుధవారం స్థానిక రైల్వేస్టేషన్‌కు ఆమె వసతులు సమస్యలు తెలుసుకోవడానికి పర్యటనకు వచ్చారు. ఆమెకు టిడిపి జిల్లా కార్యదర్శి అర్తిమల్ల రమేష్, అరసం కార్యదర్శి కె శరత్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బెల్లంకొండ రాంగోపాల్రావు, టిడిపి మండల అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, మాజీ ఎంపీపీ గల్లా బాబురావు, పిడిఎఫ్ కన్వీనర్ దర్శిశేషారావు ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. సుమారు 18 నెలల నుంచి పల్నాడు ఎక్స్ప్రెస్, రేపల్లె నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఫాస్ట్ ప్యాసింజర్ రైలు కోసం ఉద్యమాలు చేసిన విధానాన్ని వివరించారు. స్థానిక రైల్వే సమస్యలు తెలిపారు. రాధ మాట్లాడుతూ సమస్య తీవ్రతను అర్థం చేసుకున్నా మన్నారు. సంక్రాంతి లోపు పల్నాడు ఎక్స్ప్రెస్‌కు హాల్ట్ కల్పి స్తామని హామీ ఇచ్చారు. కనీసం రెండు నెలల్లోపు గ్యారెంటీ గా ఆగుతుందన్నారు. ట్రైను హాల్టు కల్పించిన తర్వాత మరోసారి వస్తానన్నారు. పలు అంశాలపై ఆమె చర్చించారు. ఆసుపత్రి డైరెక్టర్ అంద్ర ప్రసాదు, డిసీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు, మద్దినేని సత్యం, మాజీ ఎంపీటీసీ షేక్ ముంతాజ్, షేక్ మిలట్రీ మౌలాలి, కె. సుధాకర్ పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో హాల్టింగ్ కల్పించాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి రైల్వే స్టేషన్లో నర్సాపూర్, డెల్టా ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్ రైళ్ళకు హాల్ట్ కల్పించాలని జోనల్ రైల్వే విని



పర్యటనకు వచ్చిన కొంకా రాధా

యోగదారుల సంప్రదిపుల కమిటీ మెంబర్‌కి టిడిపి నాయకులు విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి రైల్వే స్టేషన్‌ను జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ మెంబర్ కొంక రాధ బుధవారం స్టేషన్‌లో రైల్వేప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. రెండవ ప్లాట్ ఫామ్‌పై చైర్స్ ఏర్పాటు చేయాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని, ప్రయాణికులకు నిరంతరాయంగా రక్షిత మంచినీటి సరఫరా చేయాలని సూచించారు. స్టేషన్ మాస్టర్ వెంకటరెడ్డిని ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలు గురించి తెలుసుకున్నారు. మహిళా సిబ్బందికి ప్రత్యేకంగా బాత్ రూమ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. రైల్వే కళ్యాణ మంటపం పునరుద్ధరణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రాత్రి వేళల్లో తాగుబోతులు, గంజాయి బ్యాచ్ ఆగడాలు ఎక్కువ య్యాయని స్టేషన్‌లో ఆర్పీఎఫ్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని కోరారు. టిడిపి నాయకులు ఎక్స్‌ప్రెస్ రైళ్ళకు హాల్ట్ కల్పించాలని రాధకు వినతి పత్రం అందజేశారు. ఆమె వెంట రైల్వే ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె.కృపాకర్ ఉన్నారు. కార్యక్రమం లో టిడిపి నాయకులు నాగేశ్వరావుకంబాల వెంకటేశ్వరావు, కోమటినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కామన్ ట్యూషన్ పేరుతో అక్రమ వసూళ్లు

ప్రజాశక్తి-దాచేపల్లి

దాచేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు కామన్ ట్యూషన్ పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి బలవంతంగా రూ.2500లు అక్రమ వసూలు చేస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో కామన్ ట్యూషన్ పేరుతో డబ్బులు వసూలు చేయడం చట్టవిరుద్ధం. ఇది విద్యా హక్కు చట్టాన్ని అపహాస్యం చేయడమే. పేద విద్యార్థులూ డబ్బు చెల్లించాల్సిందేనంటూ హుకుం జారీ చేస్తున్నారని సమాచారం. ఈ విషయమై పాఠశాల ప్రధానో పాధ్యాయులను, ఎంఈఓను వివరణ కోరగా తమకు తెలియ దనడం గమనార్హం. జిల్లా విద్యాశాఖాధికారి స్పందించి విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యుత్ అధికారులకు సహకరించండి

ప్రజాశక్తి - బెల్లంకొండ

బెల్లంకొండ మండల గ్రామ ప్రజలకు విద్యుత్ శాఖ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాను ప్రకారంగా కరెంట్ మీటర్ సర్వీస్ నెంబర్లకు ఆధార్ కార్డు నెంబర్లు (ఫోటోలు) గమనించారు. ఆ తప్పులను సరి చేసే నిమిత్తం విద్యుత్ శాఖ అధికారులు గ్రామంలోని మీ ఇళ్ళ వద్దకు వచ్చి మీటర్ సర్వీస్ నెంబర్ పేరు చెప్పి ఆధార్ కార్డు అడిగినప్పుడు ఇంటి యజమానులు దగ్గర్లో లేకపోయినా వారి ఆధార్ కార్డులను వాట్సాప్ చేయించుకొని విద్యుత్‌సిబ్బందికి చూపించాలని ఏఈ తెలిపారు.



సైన్సు ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈవో శివనాగేశ్వరరావు

వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - రెంటచింతల

విద్యార్థి దశ నుంచి సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలి విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతకు వెలికి తీయడానికి, సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయని, సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని ఎంఈవో2 శివనాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎంఈవో ప్రారంభించారు. ఎగ్జిబిషన్లో 27 ప్రాజెక్టులు రాగా అందులో 4 ప్రాజెక్ట్స్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. సెయింట్ జోసఫ్స్ పాఠశాలకు చెందిన హేమ, మంచికల్లు జడ్పీ విద్యార్థి సీహెచ్ నవీన్, ఏపి ట్రైబల్ వెల్ఫేరు స్కూల్‌కు చెందిన ఆర్.శివయ్య.కె. యశ్వం త్, ఏపీమోడల్ స్కూల్‌కు చెందిన జి.నిఖిల్, పి.దేవాలు ఈనెల 22 న నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు సెలక్ట్ అయ్యారు. కార్యక్రమంలో హెచ్ఎంలు దుర్గాప్రసాద్, సిలార్, రవి, మోహన్, పాపయ్య, సైన్స్ఆఫీసర్ విద్యా సాగర్ ఉపాధ్యాయులు ఎం రాంబాబు, శేష సాయి, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మాదల గ్రామసభ తోట బ్రహ్మయ్య అధ్యక్షతన బుధవారం జరిగింది.ఈ మహాసభలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు గుంటుపల్లి బాలకృష్ణ పాల్గొని మాట్లాడుతూ రైతాంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ విధానాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారనీ, వీటికి వ్యతిరేకంగా రైతాంగాన్ని ఐక్యం చేసి పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. గతంలో రైతాంగాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులను కూడా కాలరాస్తూ రైతాంగాన్ని వ్యవసాయానికి దూరం చేసే కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రవేశపెట్టాలని ప్రయత్నిస్తున్నారని వీటికి వ్యతిరేకంగా రైతాంగం పార్టీలకు కులాలను ప్రాంతాలను పక్కన పెట్టి ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపు నిచ్చారు. అనంతరం రైతు సంఘం గ్రామ అధ్యక్షు డిగా తోట బ్రహ్మయ్యను కార్యదర్శిగా మస్తాన్ రావును సభ్యులుగా కందిమళ్ళ సాంబశివరావు,ఇందూరి వెంకటరెడ్డి, చెరుకూరి శివయ్య, యర్రంశెట్టి సుబ్బారావు, గడ్డం రామారావు, మహంకాళయ్య, పూజల అంజయ్యను ఎన్నుకున్నారు. మార్పుల వెంకటరెడ్డి, గారాజాలయ్య,సైదా ఖాన్, దారా చిన్నారావు చింతపల్లి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

టిట్కో ఇల్లు వద్దు, స్థలమే కావాలి అంటున్న పేదలు : సిపిఎం





యర్రబాలెంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రవి, తాడేపల్లిలో ధర్నా నిర్వహిస్తున్న పేదలు

ప్రజాశక్తి -మంగళగిరి రూరల్

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ యర్రబాలెంలో సిపిఎం నాయకులు రవి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 17న మంగళగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద వేలాది మంది పేదలు ఇళ్ల స్థలాలు కొరకు ధర్నా నిర్వహించి అధికారులకు అర్జీలు అందజేశారని అన్నారు. పేదలు అందజేసిన ఇళ్ల స్థలాల అర్జీలపై ఇంతవరకు అధికారులు ఎంక్వయిరీ చేపట్టకపోవడం చూస్తుంటే పాలకులు పేదల పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో తేటతెల్లమవుతుందని అన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా రాజధాని గ్రామాల్లో నివసిస్తున్న ఇళ్ల స్థలాలు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు. కార్పొరేట్లకు వేలాది ఎకరాలు భూపందారం చేస్తున్న ప్రభుత్వం పేదలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఎందుకు ఇవ్వడం లేదని రవి ప్రశ్నించారు. టిట్టుకో ఇల్లు కట్టిస్తామంటూ సచివాలయాల్లో పేర్లు నమోదు చేపిస్తున్నారని, టిట్కో ఇల్లు నిర్మించేందుకు స్థలం కేటాయించారా ఎక్కడ కేటాయించారు ఎప్పుడు ఇల్లు నిర్మించి పేదలకు అప్పగిస్తారని పేదలు అడుగుతున్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారని అన్నారు. టిట్కో ఇల్లు వద్దు ఇళ్ల స్థలాలే కావాలని పేదల కోరుతున్నారని పేదల కోరుతున్న విధంగా ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించే విధంగా చర్యలు చేపట్టాలని రవిడిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేయాలని చూస్తే దశలవారీ ఆందోళన చేపడుతామని రవి అన్నారు.

మంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి- తాడేపల్లి

మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు అర్హులైన వారందరికీ పట్టణంలో 2 సెంట్లు, గ్రామంలో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇస్తానని చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం పుష్కర కాలనీ, బోటు యార్డు, కేఎల్రావు కాలనీ, ఇళ్ల స్థలాల బాధితులు ఉండవల్లి సెంటర్లోని సచివాలయం అడ్మిన్‌కు వినతి పత్రం అందజేశారు. ఇంతకుముందు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2018 కృష్ణా పుష్కరాలు సందర్భంగా ఇల్లు తొలగించిన 247 మంది పేద బాధ్యతలకు 2 సెంట్లు చొప్పున ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. 12 ఏళ్ల తర్వాత వచ్చే పుష్కరాలు రాబోతున్న నేటి తరుణంలో కూడా ప్రభుత్వాలు మారాయి తప్ప, పేదల సమస్యలు తీరలేదని చెప్పారు. గత ఎన్నికల సందర్భంగా ప్రస్తుత మంత్రి నారా లోకేష్ ఇచ్చినా మీ మేరకు ఇప్పటికైనా వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు సాయి మందించాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణంలో అర్హులైన పేదలు గత అక్టోబర్లో మంగళగిరిలో పేదలుజరిగిన ఇళ్ల స్థలాల ధర్నాలో వందలాదిగా కదులు వచ్చి అర్జీలు ఇచ్చి నేటికీ రెండు నెలలు దాటిన సమస్య పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు లబ్ధిదారుల లిస్టును ప్రకటించి నిజమైన లబ్ధిదారులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. లేనట్లయితే బాధ్యత ప్రజలను సమీకరించి ఆందోళన చేపడుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దొంతి రెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, కె.మేరీ, జి.గంగాభవాన్ని, రాజు, సిహెచ్.సోమేశ్వరి, రాజేష్, మరియమ్మ, కొండలు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ బజారు అధ్యక్షురాలిగా భారతీదేవి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు కల్పవల్లి కో-ఆపరేటివ్ స్టోర్స్ (సూపర్ బజార్) కు ప్రభుత్వం కొత్త పాలకవర్గాన్ని నియమించింది. ఈ మేరకు వ్యవసాయ, సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు సభ్యులతో కూడిన నాన్-అఫీషియల్ కమిటీని ఏర్పాటు చేశారు. పర్సన్-ఇన్-చార్జ్‌గా పొన్నగంటి భారతీ దేవి, సభ్యులుగా ఉప్పతల సాంబశివరావు, చింతకాయల వెంకట సాయి నియమితులయ్యారు. బుధవారం నాడు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవిని మర్యాద పూర్వకంగా కలుసుకొని, తమ నియామకానికి కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ఆకతాయిల చర్యలకు అడ్డుకట్ట వేయండి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా ఈవ్ టీజింగ్, బైక్ రేసింగ్‌లను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేసి విద్యార్థినీలకు భరోసా కల్పించాలని ఆయన కోరారు. ఆకతాయిల చర్యలకు అడ్డుకట్టవేయాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు అధికారులు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈవ్ టీజింగ్ కి పాల్పడే 260 మందిని, బైక్ రేస్ , రాష్ డ్రైవింగ్ చేసే 214 మందిని గుర్తించి, వారికి తగిన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటువంటి చర్యలు భవిష్యత్తులో కొనసాగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. మహిళలు, ఆడపిల్లలపై అసభ్యంగా ప్రవర్తించడం, వారి గోప్యతకు భంగం కలిగించడం లేదా ఇతర అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారా అనే కోణంలో పలు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేశారు. కొంతమంది ఆకతాయిలను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు.నిబంధనలు పాటించకుండా బైక్ రేసింగ్, స్నేక్ డ్రైవింగ్‌కు పాల్పడిన వారిని గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకుని అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించి చట్టపరమైన చర్యలు చేపట్టారు.




కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

పెన్షనర్లకు నష్టం కలిగిస్తే పోరాటమే..

ప్రజాశక్తి - మంగళగిరి

పెన్షనర్స్‌కు నష్టం కలిగించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై రానున్న కాలంలో పెన్షనర్స్ పోరాటాలు చేయాల్సి వస్తుందని ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పెన్షనర్స్ డే, రజతోత్సవ మహాసభ, మంగళగిరి శాఖ సర్వసభ్య సమావేశం బుధవారం ఇందిరా కళామందిరంలో జరిగింది. ఈ సందర్భంగా మంగళగిరి శాఖ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన డిఎన్ నకార విగ్రహాన్ని వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.గోపిరెడ్డి అధ్యక్ష వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్ల హక్కుల కొరకు అనేక పోరాటాలు చేసి, సమస్యలను పరిష్కరించుకున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న విధానం వలన పెన్షనర్స్ నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. దీనిపై పోరాటానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన 45 మంది పెన్షనర్స్‌ను శాలువలతో కప్పి అభినందించారు. కాగా 96 సంవత్సరాలు వయసు కలిగిన ఎడ్ల గంగాధరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.ప్రభుదాసు, జిల్లా అధ్యక్షులు కె.పిచ్చయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణయ్య, మంగళగిరి ఉప ఖజానా అధికారి ఎ.శ్యాంబాబు, ఎస్.మార్తమ్మ, మంగళగిరి పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు బి.వీరా ంజనేయులు, కోశాధికారి పి.కుమారస్వామి, ఉపాధ్యక్షులు పి.బాలకృష్ణయ్య, కార్యదర్శి బి.శ్యాంకుమార్ పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మంగళగిరి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా వి.గోపిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.సత్యనారాయణను తిరిగి ఎన్నికయ్యారు.





పెన్షనర్ గంగాధరరావును సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు, తెనాలిలో మాట్లాడుతున్న బాబుప్రసాద్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ కె శంకరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో అహ్మద్ హుస్సేన్, జి రవీంద్ర, టి రమణ, ఎస్ సుబ్రహ్మణ్యం, పి శివశంకర్, ఆర్.ఎస్.ఆర్ కఅష్ణ, వి ఆదినారాయణ, పి.వెంకటేశ్వరరావు, షేక్ హబీబుల్లా, ఎ.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - తెనాలి

జాతీయ పెన్షనర్ల దినోత్సవ వేడుకలను ఆల్ ఇండియా పోస్టల్ అండ్ ఆర్ ఎం ఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి శాఖ ఆధ్వర్యంలో కొత్తపేటలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు ఐ.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వేడుకలలో అఖిలభారత పెన్షనర్ల సంఘం జాయింట్ జనరల్ సెక్రటరీ ఎం.ఉమామహేశ్వరరావు , రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎం.తిరుమలరావు, బిఎస్ఎన్ఎల్ పెన్షన్స్ సంఘ నాయకులు ఎస్.రామయ్య, ఎం.రవికుమార్, ఎల్.ప్రసాదరావు, పి జోనేష్, ఎ.రషీద్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కాలేజి సెక్రటరీ, ప్రిన్సిపాల్

కానిస్టేబుల్ ఉద్యోగం పొందిన పూర్వ విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి - గుంటూరు

సంగడిగుంటలోని చలమయ్య డిగ్రీ కాలేజిలో చదివి, ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన పూర్వ విద్యార్థులు పీటం వెంకటలక్ష్మీ, పరాడి కళ్యాణి, కాసింశెట్టి అఖిల్‌గోపీచంద్‌ను బుధవారం కళాశాలలో సత్కరించారు. ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సెక్రెటరీ కర్పూరపు సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుండే వారికి నచ్చిన రంగంలో శ్రద్ధపెట్టి సాధన చేస్తే రాణిస్తారని అన్నారు. నిరుద్యోగం పెరుగుతున్న నేపథ్యంలో తీవ్ర పోటీని ఎదుర్కొని ప్రభుత్వ ఉద్యోగం సాధించటం అభినందనీయం అన్నారు. నిరంతర సాధన చేస్తే ఎంతటి కష్టమైనా సులభంగా సాధించగలం అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు ఎ.శ్రీధర్, వై.చంద్రశేఖర్, అధ్యాపకులు ఇందిరా, రమాదేవి, కృష్ణ, హరిలాల్ పాల్గొన్నారు..

స్పెల్ బి పోటీల్లో సెయింట్ లారెల్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక ఆర్టీసి కాలనీలోని సెయింట్ లారెల్స్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు షేక్.సుహానా ముస్కాన్, షేక్.మయూర రాష్ట్ర స్థాయి స్పెల్‌బి పోటీల్లో ప్రతిభ చూపారని డైరెక్టర్ మేకల రవీంద్ర తెలిపారు. బుధవారం ఆయా విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. కెఎల్‌పి పాఠశాలలో జరిగిన స్పెల్‌బి పోటీలోలలో తమ పాఠశాల విద్యార్థులు 5వ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సాయిశ్రీకర్, హెచ్ఎం మీనాక్షి, ప్రిన్సిపాల్ ఎ.కళ్యాణి, ఎం.లక్ష్మి, అనితాజ్యోతి, లక్ష్మీభారతి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ మేకల రవీంద్ర



డాక్టర్ రమణ యశశ్విని సన్మానిస్తున్న సభ్యులు

పెన్షనర్లకు ప్రాధాన్యం : డాక్టర్ రమణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రైల్వే పెన్షనర్ల సంక్షేమ సంఘ సభ్యుల సమావేశం స్థానిక అరండల్‌పేట యోగి భవన్‌లో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో దాదాపు 180 మంది పెన్షనర్లు పాల్గొన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్-ఎస్‌వి రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దాదాపు 21 మంది పెన్షనర్లను డాక్టర్.ఎస్.ఎస్.వి.రమణ సత్కరించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం డాక్టర్ ఎస్.ఎస్.వి. రమణను సత్కరించింది. డాక్టర్ రమణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలోచికిత్సలలో రైల్వే రిటైర్డ్ ఉద్యోగులకు ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో పెన్షనర్లు వార్షిక జనరల్ బాడీ సమావేశాన్ని కూడా నిర్వహించారు. కొత్త కమిటీని ఎన్నుకున్నారు. కొత్త కమిటీ సభ్యులుగా డివిజనల్ ప్రెసిడెంట్‌గా కె.నారాయణ రెడ్డి, డివిజనల్ సెక్రటరీగా ఎల్.రాఘవబాబు, ట్రెజరర్‌గా వి.ఆదినారాయణ ఎన్నికయ్యారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట మండల యూటీఎఫ్ నూతన కౌన్సిల్ ఎన్నికలు బుధ వారం ఏలూరు సిద్దయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. పట్టణ మండల శాఖ యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు పి. ప్రేమ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎన్ సుందర్‌రావు పర్యవేక్షణలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం మోహన్ రావు ఎన్నికల అధికారిగా చిలకలూరిపేట మండల నూతన కౌన్సిల్ ఎన్నికలు జరిగాయి. ఎన్నికలలో చిలకలూరి పేట మండల గౌరవ అధ్యక్షులుగా సోమేపల్లి కోటేశ్వరరావు, మండల అధ్యక్షురాలుగా దొరడ్ల సుజాత, మండల ప్రధాన కార్యదర్శిగా షేక్ మొహమ్మద్ యాసీన్, సహ అధ్యక్షురాలుగా ఇంటూరి సునీత,ఎం. ఉమామహేశ్వర, మండలకోశాధికారిగా డి.ఏసన్న నాయక్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు. ఎన్నిక కాబడిన నూతన కార్యవర్గ సభ్యులచే రాష్ట్ర కౌన్సిలర్ ఎన్. సుందరావు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం యుటిఎఫ్ ముద్రించిన పదవ తరగతి టెస్ట్ పేపర్ల పుస్తకాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కే. అరుణ, జిల్లా కౌన్సిలర్లు కే. తిరుపతి స్వామి, వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధులు బహిష్కరణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

న్యాయవాదులను, న్యాయవాద వృత్తిని కించపరచటమే కాక రాజీ పేరుతో కక్షిదారుడిని తీవ్రంగా బెదిరించి అవమాన కరమైన భాషను ఉపయోగించిన మేడికొండూరు కానిస్టేబుల్ మస్తాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూరి అజెయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో సత్తెనపల్లి న్యాయవాదులు విధులను బుధవారం కోర్టు విధులు బహిష్కరించి, న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు న్యాయవాదులు పాలొన్నారు.

వాసవీ క్లబ్ అధ్యక్షులుగా సత్యనారాయణ

ప్రజాశక్తి - దుర్గి

వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులుగా చుండూరు సత్యనారాయణను బుధవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వాసవి క్లబ్ కార్యాలయంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా చుండూరు సత్యనారాయణ ప్రధాన కార్యదర్శిగా బొచ్చు రాజకుమార్ కోశాధి కారిగా బత్తుల వీర బ్రహ్మమును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 204ఎ గవర్నర్ సూరే వెంకట కోటిలింగం నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ రీజనల్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవ రావు జోన్ చైర్మన్ భవనారి సత్యనారాయణ ఎం.చిన్న ఆదినారాయణ రిటైర్డ్ ఎల్ఐసి డివో బిక్షాలనాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన ఎస్ఐ లోకేశ్వరరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా లోకేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును టిడిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. రానున్న స్థానిక ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రొంపిచర్ల మండల కార్యదర్శి గాడిపర్తి సురేష్, సీనియర్ నాయకులు శాఖమూరి రామ్మూర్తి ఎస్ఐకు శుభాకాంక్షలు తెలిపారు.

అన్ని సర్వేలను సమగ్రంగా నిర్వహించండి

ప్రజాశక్తి - నాదెండ్ల

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ సర్వేలపై సర్వేలో పాల్గొనే గ్రామ సచివాలయాల సిబ్బందికి సంబంధిత డిప్యూటీ ఎంపీడీవో వెంకట్రావు ఆధ్వర్యంలో నాదెండ్ల మండల పరిషత్ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు సర్వేలలో సిబ్బంది అవలంబించాల్సిన విధానాలను, సాంకేతిక విషయాలను సమావేశంలో వివరించారు. పౌరుల నుంచి సేకరించాల్సిన అంశా లను, సమాచారాన్ని ఇందులో వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీ డీవో వెంకట్రావు, రోడ్లు, భవనాల శాఖ మండల ఏఈ రవీంద్ర, సాతులూరు, గణపవరం పంచాయతీ కార్యదర్శులు రాఘవయ్య, మారుతీబాబు, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు హాజరయ్యారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు ఆరు ప్రాజెక్టులు ఎంపిక

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల మండల విద్య వైజ్ఞానిక ప్రదర్శన స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ప్రదర్శన ఏర్పాటు చేశారు. 30 ప్రాజెక్టులు రాగా ఇందులో ఆరు ప్రాజెక్టులు ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపారు. మండల నోడల్ ఆఫీసర్ జాన్ కెన్నెడీ, సైన్స్ ఆఫీసర్ సుజాత ముఖ్య అతిథిలుగా మాచర్ల ఎంఈఓలు కోటేశ్వరరావు, అల్లి సురేష్, హెచ్ఎం వెంకటేశ్వర్లు హాజరైనారు. జిల్లాకి ఎంపికైన వారు ఉపా ధ్యాయ విభాగంలో జే.గంగాధర్ బాబు (జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మాచర్ల), ఎం.సుజాత (గవర్నమెంట్ ఆశ్రమ స్కూల్ ఎత్తిపోతల) వ్యక్తిగత విభాగంలో ఎం.త్రిషారాణి (గవర్నమెంట్ ఆశ్రమ స్కూల్ ఎత్తి పోతల), డి.వీర మౌనిక (సెయింట్ ఆన్స్ గర్ల్స్ హైస్కూల్ మాచర్ల), గ్రూపు విభాగంలో ఎం.శ్రీలక్ష్మి, మేఘమాల (గవర్నమెంట్ ఆశ్రమస్కూల్ ఎత్తిపోతల), జే.చంద్రహారిక, జాహ్నవి (జడ్పీహెచ్ఎస్ తాళ్లపల్లి) ఎంపిక అయ్యారు. విద్యార్థులను అభినందించారు, న్యాయనిర్ణేతలుగా ప్రసన్న, రత్నాప్రకాష్ వ్యవహరించారు. వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యా యులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయునికి షీల్డ్ అందిస్తున్న ఎంఈవో



హోరా హోరీగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి డివిజన్ ఉపాధ్యాయుల క్రికెట్‌పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాద్యాయుల క్రికెట్‌పోటీల్లో అచ్చంపేట, సత్తెనపల్లి మండలాల జట్లు బుధవారం ఫైనల్‌కు చేరాయి. మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో అచ్చంపేట, ముప్పాళ్ల మండలాలు తలపడగా మొదట బ్యాటింగ్ ఎంచుకున్న అచ్చంపేట మండల జట్టు 134 పరుగులు చేయగా తర్వాత బ్యాటింగ్ చేసిన ముప్పాళ్ల మండలం నిర్ణీత 12 ఓవర్లకు 82 పరుగు లకే ఆలౌట్ అవ్వడంతో అచ్చంపేట మండలం జట్టు 52 పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్‌కి చేరింది. రెండవ సెమీ ఫైనల్స్‌లో సత్తెనపలి, క్రోసూరు మండలాల జట్లు పోటీపడగా మొదట బ్యాటింగ్ ఎంచుకున్న క్రోసూరు జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 93 పరుగులు చేయగా తర్వాత బ్యాటింగ్ చేసిన సత్తెనపల్లి మండల జట్టు 11 ఓవర్లలో 94 పరుగులు చేసి ఫైనల్‌కి చేరింది. గురువారం ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని సత్తెనపల్లి డివిజన్ కోఆర్డినేటర్ బి.అనీల్ దత్తా నాయక్ తెలిపారు. మండల కోఆర్డినేటర్ లాకు పిచ్చయ్య, నిర్వాహకులు సాంబశివరావు, వి.శివరామకృష్ణ, వై.శ్రీనివాసరావు, ఎ.చిన్నయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు కూటమి ప్రభుత్వం అండ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య నాయకులతో మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు స్మృతి వనం, లైబ్రరీ మోమోరియల్ ట్రస్ట్ విధి, విధానాలు గురించి వివరించారు. సభకు అధ్యక్షత వహించిన సీనియర్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా ఆర్య వైశ్య సంఘము అధ్య క్షులు అత్తులూరి సుబ్బారావు మాట్లాడారు. కార్య క్రమంలో టిడిపి రాష్ట కార్యదర్శి చౌటశ్రీనివాసరావు, అత్తులూరి సుబ్బా రావు, చౌట శ్రీనివాసరావు, ఐ.వి.ఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి. శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వర్లు (కొండలు), పి.రామకోటేశ్వర రావు, చిల్లంచర్ల కళ్యాణ్, డి.కాశీ, ఎన్. వెంకటరమణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - వినుకొండ

ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ సీనియర్ శాసన సభ్యులు జీవి ఆంజనేయులు అన్నారు. వినుకొండ నియోజకవర్గ ప్రజల కోసం చీఫ్‌విప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ప్రతి ఒక్కరి సమస్యను అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపుతానన్నారు. ఫిర్యాదులను పరిశీలించిన ఆంజనేయులు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

పిపిపి ఫలితాపై విషప్రచారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర వైద్యరంగంలో కూటమి ప్రభుత్వం తీసుకు వస్తున్న పెను మార్పులు, వాటి ఉత్తమ ఫలితాలు ప్రజలకు అందకూడదన్న దురుద్దేశంతోనే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అండ్ కో పిపిపిపై విషప్రచారం చేస్తు న్నారని టిడిపి రాష్ట్ర ఎస్‌టి సెల్ అధ్యక్షులు దారునాయక్ విమర్శించారు. టిడిపి పల్నాడు జిల్లా కార్యాలయంలో బుధ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దారు నాయక్ మాట్లాడుతూ పిపిపి విధానంపై పార్లమెంట్ స్థాయీ సంఘం సిఫార్సులు సదరు విధానాన్ని దేశమంతా అమలు చేయాలన్న దిశగా తీసుకున్న నిర్ణయాలను తప్పు పడుతూ పిపిపి విధానంపై దుష్ప్రచారం చేస్తున్న వైసిపికి చెంప పెట్టు అన్నారు.

చిన్నారులకు నూతన వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి - దుర్గి

స్వామి వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ మాచర్ల వారి ఆధ్వర్యంలో చెంచు చిన్నారులకు నూతన వస్త్రాలు మరియు చలికోట్లు పంపిణీ చేశారు. స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ మాచర్ల వారి ఆధ్వర్యంలో నిర్వహించుచున్న స్థానిక శ్రీశైలం రోడ్‌లోని స్వామి వివేకానంద సేవాశ్రమంతో ఆశ్రమం పక్కన పూరి గుడిసెల్లో నివసిస్తున్న వారు చలికి ఇబ్బంది పడటం గమనించిన మెట్టు గోవిందరెడ్డి వారికి నూతన వస్త్రాలు, చలి కోట్లు పంపిణీ చేశారు. మెడిటేషన్ మాతాజీ ఇందిరా దేవి సుందరమ్మ, శ్రీను, నారాయణ రెడ్డి ,స్వరాజ్యం ఆశ్రమంలోని సిబ్బంది పాల్గొన్నారు.

డయల్ యువర్ డిఎంకు 33 ఫిర్యాదులు

ప్రజాశక్తి - మాచర్ల

డిజిటల్ ద్వారా ప్రయాణికుల ఆధార్‌కార్డు అనుమతిస్తారని ఓ ప్రయాణికుడి ప్రశ్నకు ఆర్టీసి డిపో మేనేజర్ బి.వీరాస్వామి సమాధానమిచ్చారు. ఏపిపిటిడి మాచర్ల డిపో మేనేజర్ బి.వీరాస్వామి బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమానికి 33 మంది ఫిర్యాదులు అందాయి. కర్నూల్ బస్సును తిరిగి పునరుద్ధరించాలని, కంభంపాడుకు ఎక్స్‌ప్రెస్ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని, కారంపూడి నుంచి గురజాలకు బస్సు సర్వీస్ ఏర్పాటు చేయాలని తదితర విజ్ఞప్తులు ఫోన్ ద్వారా డిఎంకు తెలియజేశారు. కర్నూలుకు త్వరలో బస్సు ఏర్పాటు చేస్తామని, కంభంపాడులో రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేస్తామని, బస్సులు లేనందున గురజాలకు బస్సు వేయలేమన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై నేడు నిరసన

ప్రజాశక్తి - కారంపూడి

సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేయొద్దనీ, పిపిపి విధానాన్ని అమలుపరచవద్దనీ, పేద, మధ్యతరగతి విద్యార్థులకు చదువును దూరం చేయొ ద్దని డిమాండ్ చేస్తూ నెల 18వ తేదీ నిరసన చేపడు తున్న ట్లు భారత కమ్యూనిస్టు పార్టీ కారంపూడి మండల కార్యదర్శి షేక్ సైదా తెలిపారు. మెడికల్ కళాశాల వద్ద నిర్వహించే ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణను వ్యతిరేకించే వారు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పొట్టి శ్రీరాములు స్మృతివనానికి ఎమ్మెల్యే విరాళం

ప్రజాశక్తి - వినుకొండ

రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న పొట్టి శ్రీరాములు స్మృతి వనానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు వ్యక్తిగతంగా రూ.10 లక్షల విరాళం ప్రకటించారు. బుధవారం ఈ మేరకు అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి రూ. 10లక్షల చెక్కును అందించారు.



అనంతరం మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం 6.8 ఎకరాల స్థలాన్ని కేటాయించి, అమరజీవి 58 రోజులు దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయడం ప్రశంస నీయమన్నారు. ప్రపంచపటంలో ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు నిచ్చేలా అమరావతి రూపుదిద్దుకుంటోందని అన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - బెల్లంకొండ

బెల్లంకొండ మండల కేంద్రానికి రావడానికి నాగిరెడ్డి పాలెం, రాజుపాలెం మండలంలోని చౌటపాపయ పాలెం, నందిరాజు పాలెం గ్రామాల మధ్యనున్న రోడ్డుకు పరిష్కారం దొరికింది. బెల్లంకొండ మండల కేంద్రం నుండి ఆ గ్రామాలు వెళ్లే ప్రజలకు గతంలో రోడ్డు లేక ఎవరో ఇబ్బం దులు ఎదుర్కొన్నారు. ఈ డొంక రోడ్డు మట్టి మార్గంలోని ఉండడంతో ప్రజలకు విద్యార్థులకు నిత్య వాహదారులు ఇబ్బందులు పడుతూ వచ్చారు. నేడు ఈ గ్రామాలు వెళ్లడానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌దృష్టికి రాష్ట్రమైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్ తీసుకు వెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మైనింగ్ నిధుల నుంచి రూ.20 లక్షలు మం జూరు చేయించారు. నిధులు విడుదల కావడంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి ఈ ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్ట డంతో మూడు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పథకాల అమలుకు యూనిఫైడ్ సర్వే

ప్రజాశక్తి - బెల్లంకొండ

సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి యూనిఫైడ్ సర్వే ఉపయోగపడుతుందని ఎంపీడీవో సునీత తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందికి సర్వేపల్లి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందరరేగా మాట్లాడుతూ పూర్తి వివరాలతో కూడిన వీడియో ప్రజెంటేషన్ ద్వారా ఎంపీడీవో అవగాహన కల్పించారు. కుటుం బాల సమగ్ర వివరాలు పారదర్శంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సర్వేలో సేకరించిన డేటా ఆధారంగా ఫ్యామిలీ బెనిఫిట్ కార్డులు జారీ చేయడం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో ఈపిఓపిఆర్డి గిరిరెడ్డి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై సమావేశం

ప్రజాశక్తి - బెల్లంకొండు

ఈనెల 21న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయా లని ఎంపీడీవో సునీత తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పల్స్ పోలియోపై మండల టాస్క్‌ఫోర్సు కమిటీ సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 2311 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ధారించుకున్నట్లు పిహెచ్సి వైద్యాధికారి దీపిక తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు బి. రాజకుమారి, బాలసుంద్రావు, సూపర్వైజర్ బాష, సిహెచ్ఓ మణికుమారి వివిధ శాఖల అధికారులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సామగ్రిని అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

అంగన్వాడి కేంద్రానికి సామగ్రి వితరణ

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని కొచ్చర్ల గ్రామంలో అంగన్వాడి కేంద్రం నకు యంగ్ స్టార్ స్లీపింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుర్చీలు, చాపలను సంస్థ అధ్యక్షులు పి అనిల్ రాజ్ వితరణగా బుధ వారం అందజేశారు. అనంతరం పిల్లలకు పండ్లు, మిఠాయిలు పంచి పెట్టారు. సొసైటీ డైరెక్టర్ అయినాల కోటేశ్వరరావు,ఎస్సీ సెల్ నాయకులు పి.ఇజ్రాయిల్, అంగన్వాడి కార్యకర్త పార్వతి పాల్గొన్నారు.

బాలోత్సవ క్రీడల్లో బాలికలు సత్తా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (సుగాలి)లో జరుగుతున్న జోనల్ స్థాయి బాలోత్సవ్ క్రీడల్లో సత్తెనపల్లి మండలం అబ్బూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు ప్రతిభ కనబరిచారు. 100 మీటర్ల పరుగు పందెంలో నోముల దివ్య, షాట్ పుట్‌లో కె మాళవిక ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించారు. ప్రధానోపాధ్యా యులు దాసరి పాపయ్య పిడి గంటా భార్గవి, గ్రామస్తులు బాలికలను అభినందించారు.



కేస్ కట్ చేస్తున్న నరేష్

ఘనంగా మేడికొండూరు నరేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - చేబ్రోలు

సమిస్తా డెవలపర్స్ అధినేత మేడికొండూరు నరేష్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అనంతరం నరేష్ కేక్‌ను కట్ చేశారు. ఎమ్మెల్యే పార్టీ నాయకులు అభిమానులు, శ్రేయోభిలాషులు, స్థానిక మండల, గ్రామస్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. వడ్లమూడి, గరువుపాలెం, గౌడపాలెం, శలపాడు, శేకూరు, వేజెండ్ల గ్రామ ప్రజలు అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ బడే , పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మీ నారాయణ నరేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు అని తెలిపారు

ప్రజా నాయకులు ఆళ్ల రాఘవయ్య

ప్రజాశక్తి - కాకుమాను(పెదనందిపాడు)



ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన పోరాట యోధుడు, సుధీర్ఘకాలం నాగుల పాడు గ్రామ సర్పంచ్‌గా సేవలం దించిన కమ్యూనిస్టు నాయకులు ఆళ్ల రాఘవయ్య 11వ వర్ధంతి సందర్భంగా నాగులపాడులోని వారి విగ్రహం వద్ద అభిమానులు ఘన నివాళులర్పించారు. నల్లమడ రైతు సంఘం తొలి ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రాఘవయ్య నల్లమడ ముంపు సమస్యలపై ప్రభుత్వంపై పోరాడి నల్లమడ వాగు అభివృద్ధికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు ఆళ్ల విజయ్ కుమార్, ఆళ్ల సుబ్బారావు, ఆళ్ల హరి ప్రసాద్, ఆళ్ల లోకాదిద్య, రైతు సంఘం నాయకులు కాపు వెంకట సుబ్బారావు, పిఎఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీర రాఘవయ్య, బండి నాగబాబు, ఆళ్ల రాజారావు, పాటిబండ్ల నాగబాబు, పోపూరి లక్ష్మీనారాయణ, ఆళ్ల మణిబాబు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.



కేశవరరావును అభినందిస్తున్న సభ్యులు

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కేశవరావు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్‌గా ఎర్రగుంట్లపాడు గ్రామ సర్పంచ్ జనసేన పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి తడవర్తి కేశవరావు, వైస్ చైర్మన్‌గా షేక్ జానీ బేగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు ఫిరంగిపురం, మేడికొండూరు మండలాలకు చెందిన 15 మంది డైరెక్టర్లుగా ఎన్నికైనారు. చైర్మన్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం నుండి రైతులకు రావలసిన అన్ని రకాల పథకాలను రైతులకు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

నాంది ఫౌండేషన్ శిక్షణ పూర్తి

ప్రజాశక్తి - తెనాలి

విద్యార్థులలో ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకునేందుకు నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో 36 గంటల పాటు శిక్షణ నిర్వహించారు. కళాశాల చైర్మన్ అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం ఫైనల్ ఇయర్ బీకాం, బీఎస్సీ, బిసిఏ చదువుతున్న విద్యార్థులు 200 మంది శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని ఫౌండేషన్ ఇంచార్జ్ శ్రీలక్ష్మి, నరసింహ, సాగర్ పర్యవేక్షించారు. ఈనెల 15 నుంచి ప్రారంభమైన శిక్షణ 36 గంటల పాటు కొనసాగింది. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు వివిధ రంగాలలో ఉద్యోగాలు పొందేందుకు కావలసిన నైపుణ్యాలను నేర్పించినట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులను చైర్మన్ అభినందించారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామ్‌చంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్‌లో కెఎల్‌యు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్‌యు విద్యార్థులకు జాతీయ స్థాయిలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025లో విజేతలుగా నిలిచి 1.5 లక్షల నగదు బహుమతిని సాధించారు. ఉపాధ్యాయులు హాజరును తీసుకొని బోధనా తరగతులకు ఉపయోగించే సమయాన్ని తగ్గించడానికి కెఎల్ యు విద్యార్థుల బృందం ఆర్ ఎఫ్ ఐడి ఫేస్ డిటెక్షన్ ఆధారిత వ్యవస్థను అబివృద్ధి చేశారు. విద్యార్థుల హాజరును బట్టి ఎంతమందికి భోజనం సిద్ధం చేయవచ్చునో ప్రిన్సిపాల్, విద్యార్థి పాఠశాలలోకి ప్రవేశించినప్పుడు, బయలు దేరినప్పుడు తెలుసుకోవడానికి తల్లిదండ్రులకు ఎస్ఎంఎస్ కూడా పంపబడుతుంది. మెంటార్ డాక్టర్ శ్రీపతిరాయ్ కోగంటి మాట్లాడారు. ఎక్స్ పెరిమెంటల్ లెర్నింగ్ విభాగానికి చెందిన పి.వంశీకృష్ణ, వరుణ్ శర్మ, వి.జశ్వంత్, మధుహన్ శేఖర్, అంకిత బెహరా, ప్రభిషరత్ కౌర్ అనే విద్యార్థులు బృందంగా ఏర్పడి ఈ ప్రాజెక్టును విజయవంతం చేశారు. విద్యార్థులను యూనివర్సిటీ విసి డాక్టర్ జి.పార్థసారది వర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బా రావు, ప్రో విసిలు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, హెచ్ టిఐ విభాగాధిపతి డాక్టర్ కె.నరసింహరాజు, డాక్టర్ డి.అశ్వనికుమార్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న వైస్‌ఛాన్స్‌లర్, రిజిస్ట్రార్

పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

స్థానిక వడ్డేశ్వరంలోని కెఎల్‌యూనివర్శిటీలో నిర్వహించ తలపెట్టిన సిల్వర్ జూబ్లీ వేడుకల పోస్టర్‌ను బుదవారంవైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ ఆవిష్కరించారు. 1996-2000 సంవత్సరాల కాలంలో చదువు అభ్యసించిన వారికి ఈ సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించ తలపెట్టినట్లు కెఎల్ పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ కెసిహెచ్. శ్రీ కావ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ విసి డాక్టర్ జి.పార్థసారదివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బా రావు, ప్రో విసిలు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, అన్ని విభాగాల విభాగాధిపతులు పాల్గొన్నారు.

'కొందరు ఉద్యోగుల పనితీరు వల్లే ప్రభుత్వానికి చెడ్డ పేరు'

ప్రజాశక్తి - మంగళగిరి

మైనార్టీ కమిషన్ లో పని చేసే కొందరు ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరి వలన క్రైస్తవులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని క్రైస్తవ ఐక్యవేదిక జనరల్ సెక్రటరీ బైనగిరి జాషువా డేనియల్ ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీ కమిషన్ లో పని చేసే పలువురు ఉద్యోగుల వైఖరిని ఖండిస్తూ బుధవారం మంగళగిరిలోని ప్రెస్ క్లబ్ నందు క్రైస్తవ ఐక్య వేదిక ప్రతినిధులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక జనరల్ సెక్రటరీ జాషువా డానియల్, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు అబ్రహం మాట్లాడుతూ కమిషన్‌లోని పలువురు ఉద్యోగులు వాటిని పరిష్కరించకుండా ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో క్రైస్తవ ఐక్య వేదిక జేఏసీ సభ్యులు రోశయ్య, శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే దాడులు : జనసేన



మాట్లాడుదున్న జనసేన పార్టీ నాయకులు

ప్రజాశక్తి- తాడేపల్లి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యం, జనసేన జనసేన అభివఅద్ధి చూసి ఓర్వలేకనే వైసిపి కార్యకర్తలు దాడులకు దిగుతున్నారని జనసేన తాడేపల్లి పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు ఆరోపించారు. బుధవారం స్థానిక జనసేన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం రాత్రి తన కుటుంబ సభ్యులతో కలిసి మాజీ ముఖ్యమంత్రి జగన్ ఇంటి ముందు రోడ్లో వస్తుండగా, రోడ్డుకి కారు అడ్డంగా పెట్టి పెట్టిన వైసిపి కార్యకర్త సీతారం మరో నలుగురు నోటికి పట్టరాని అసభ్య పదజాలం వినియోగించి, డాడీ చేశారని ఆరోపించారు. అకారణంగా తమపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. విలేకరుల సమావేశంలో కూటమి నాయకులు జన్న రాజేష్, తేలి వెంకటేశ్వరరావు, వేల్పురి శ్రీనివాసరావు, తోట సాంబశివరావు, చందు భాస్కరరావు, పుల్లెపు భాస్కరరావు, పి.రమణ, టి.నాగు, వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నల్లబర్లీ సాగు నిషేధం : డిఏఓ పద్మావతి

ప్రజాశక్తి - కాకుమాను (పెదనందిపాడు)

ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 740ని అతిక్రమించి నల్లబర్లీ పొగాకు సాగు చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటారని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి తెలియజేశారు. బుధవారం పెదనందిపాడు మండలంలోని వరగాని గ్రామాన్ని సందర్శించి నల్లబర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించింది కనుక, రైతులు ఎవరు నల్లబర్లీ సాగు చేయవద్దని తెలిపారు. కార్యక్రమంలో మార్క్ ఫెడ్ మేనేజర్ నరసింహారెడ్డి, గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్.మోహన్‌రావు, తహశీల్దార్ ఎస్. హేనాప్రియ,రైతులు పాల్గొన్నారు.

పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి - కాకుమాను

మండలంలోని ప్రత్తిపాడు మరియు తిక్కిరెడ్డిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏడిఏ ఎన్.మోహన్‌రావు, మండల వ్యవసాయాధికారి షేక్. సుగుణ బేగం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతులు, విఎఎ కె.లావణ్య, విహెచ్ఎ వి.యామిని దేవి, ఏఈఓ వై.నీలాంబరం పాల్గొన్నారు.

కుర్నూతలలో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - కాకుమాను

వట్టిచెరుకూరు మండలం కుర్నూతలలో పొలం పిలుస్తుంది కార్యక్రమన్నీ వ్యవసాయాధికారి సి.హెచ్ సునీత బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతులు, విఏఏలు పాల్గొన్నారు.

పాత మద్రాసు రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - కాకుమాను

పాత మద్రాసు రోడ్డు కు ఏర్పడిన గుంతలకు ఆర్ అండ్ బి అధికారులు మరమత్తులు చేస్తున్నారు ఇటీవల కొన్ని నెలల క్రితమే మరమత్తులు చేసినప్పటికీ మరల గుంతలు ఏర్పడి వాహనాలు ప్రమాదానికి గురి అవుతుండటంతో ఆర్ అండ్ బి అధికారులు కోయవారి పాలెం నుండి రామ వాగు వరకు దగ్గరుండి గుంతలు మరమ్మతులు చేస్తున్నారు.

ఫిబ్రవరిలో వికసిత్ భారత్- స్వర్ణాంధ్ర సదస్సు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఫిబ్రవరిలో ఎస్ఆర్ఎం విద్యా సంస్థల సమన్వయంతో 'వికసిత్ భారత్- స్వర్ణాంధ్ర సాధన' పేరిట జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించనున్నామని 20 సూత్రాల కార్యక్రమాల (వికిసిత్ భారత్ స్వర్ణాంధ్ర) అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఏపీ ఎస్ఆర్ఎం విశ్వ విద్యాలయానికి వచ్చేసిన ఆయన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్, గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రీసెర్చ్) ప్రొఫెసర్ డి నారాయణరావులతో సమావేశమయ్యారు. సమావేశంలో సీఎఫ్ ఏవో సుమ, డీన్ రంజిత్, డైరెక్టర్లు పంకజ్, అనూప్ సింగ్, ప్రొఫెసర్ సునీత, మహేశ్ పాల్గొన్నారు.



379వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

న్యాయంగా తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 379వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకులు కేస్టీవెన్, ఎం.ఆశీర్వాదం, తుపాకుల నాగేశ్వరావు, డి.నాగేశ్వరావు, సుభాని, డి.మాణిక్యారావు, డి.అంకయ్య ప్రారంభించారు. దీక్షల్లో నారదాసు సుబ్బారావు, యహొూషువ, కందుకూరి హగ్గయ్య, పిచ్చయ్య, బి.సూర్యప్రకాష్ కూర్చున్నారు. కార్యక్రమంలో మహిళలు రమాదేవి, శారమ్మ, శారదా, సువర్ణ, దుర్గాభవాని, లక్ష్మి, రమణమ్మ, రిబ్కా,హిమాంభి, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న బాలల

అరవింద మోడల్ స్కూల్‌లో బాలనందాలు

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక అరవింద మోడల్ స్కూల్‌లో బాలనందాలు కార్యక్రమంలో నాలుగు రోజులుగా ఘనంగా జరుగు తున్నాయి. ఎల్‌కెజి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. బుధవారం ప్లాస్టిక్ గాని, ఫ్లెక్సీ కానీ వాడకుండా పేపర్‌తో డెకరేషన్ చేశారు. చిన్నారులు చాలా ప్రతిభావంతులుగా వీటిని చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి తాడేపల్లి నగరపాల సంస్థ అడిషనల్ కమిషనర్ కె.శకుంతల, అరవింద మోడల్ స్కూల్ డైరెక్టర్ బి.ఇంద్రాణి, అరవింద్ పాల్గొన్నారు.



వీరయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఎం అభిమాని మృతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలం లోని నూతక్కి గ్రామంలో సిపిఎం అభిమాని బుల్లా వీరయ్య (80) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు కుమార్తె ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామంలో లంక భూముల సమస్యలపై పని చేశారు. చివరి వరకు పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి నిలిచారు. ఆయన భౌతిక కాయానికి పలువురు సిపిఎం నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వల్లూరు భారతి, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, పిచ్చిరెడ్డి, బ్రహ్మారెడ్డి, సాంబిరెడ్డి, లాజర్, నాగి రెడ్డి, నూతక్కి మధు పాల్గొన్నారు.

చేబ్రోలు ఎస్ఐ-2గా ఈశ్వర్

ప్రజాశక్తి - చేబ్రోలు

చేబ్రోలు సబ్ ఇన్‌స్పెక్టర్2గా వి.ఈశ్వర్ పదవి బాధ్యతలను స్వీకరించారు. స్టేషనలో ప్రొఫెషనరీ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఈశ్వరును ఇదే స్టేషన్‌కు ఎస్ ఐ 2 నియమిస్తూ ఎస్పి వకుల్ జిందాల్ ఐపీఎస్, ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తిస్తానని, చేబ్రోలు మండల ప్రజలకు అందుబాటులో ఉంటాన చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎయిమ్స్ ప్రతినిధులు

ఎయిమ్స్‌లో వార్షిక పరిశోధన దినోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

ఎయిమ్స్ మంగళగిరిలో నాల్గవ వార్షిక పరిశోధన దినోత్సవం "అనుసంధాన్ దివస్-2025" ఘనంగా ప్రారంభమైంది. నైతిక క్లినికల్ పరిశోధనకు సంస్థ కట్టుబాటును ఈ సందర్భంగా నిర్వాహకులు బుధవారం ఎయిమ్స్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ & సీఈవో ప్రొఫెసర్ (డా.) అహంతెం శాంతా సింగ్ మాట్లాడుతూ ఎయిమ్స్ మూడు ప్రధాన స్తంభాలైన వైద్య విద్య, పరిశోధన, రోగి సంరక్షణలపై పనిచేస్తోందన్నారు. క్యాన్సర్, రక్తహీనత, సికిల్ సెల్ వ్యాధి వంటి ప్రజారోగ్య సమస్యలపై కీలక పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. 2019లో సేవలు ప్రారంభించిన ఎయిమ్స్ మంగళగిరి రోజుకు సగటున 3,500 మంది ఓపిడి రోగులకు సేవలందిస్తోందని, మొత్తం ఓపిడి సంప్రదింపులు 30 లక్షలు దాటినట్లు ఆయన వెల్లడించారు. నెలకు 80కి పైగా పరిశోధన ప్రతిపాదనలు ఇన్స్టిట్యూట్ ఎథిక్స్ కమిటీకి వస్తున్నాయని డాక్టర్ కె. బాబ్జీ తెలిపారు.ఈ కార్యక్రమంలో 100కి పైగా పరిశోధన ప్రాజెక్టులు ప్రదర్శించగా, ఉత్తమ పత్రాలకు అవార్డులు అందజేశారు. పలువురు సీనియర్ వైద్యులు, పరిశోధకులు, పరిశ్రమ ప్రతినిధులు హాజరయ్యారు.

అమరావతి గ్రోత్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎమ్‌డిగా శ్రీనివాస్

ప్రజాశక్తి - తుళ్లూరు


బాధ్యతలు చేపడుతున్న శ్రీనివాస్

అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎమ్‌డిగా రిటైర్డ్ ఐఎ ఎస్ అధికారి ఎస్ వి ఆర్ శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అమరావతిలోని రాయపూడి సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయంలో సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాస్‌కు పలువురు అధికారులు,సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. 1989 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్ మహారాష్ట్ర క్యాడర్‌కు చెందినవారు.పాలనా సంస్కరణలు, పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పోర్టుల అభివృద్ధి తదితర కార్యకలాపాలలో కీలకపాత్ర పోషించారు. సుమారు 22 కిలోమీటర్ల పొడవుతో దేశంలోనే అతిపెద్ద సముద్ర వంతెనగా నిలిచిన ఈ ప్రాజెక్టు ముంబైనవీ ముంబై మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడమే కాక ముంబైలోని జెఎన్‌పిటి పోర్టు (జవహర్ లాల్ నెహ్రూ పోర్టు ట్రస్ట్) కనెక్టివిటీ, దక్షిణ ముంబైలో ట్రాఫిక్ భారాన్ని తగ్గించడంలో కీలకంగా నిలిచిన ఈ ప్రాజెక్టుతో పాటు పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా రాజధాని అమరావతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తామని శ్రీనివాస్ తెలిపారు.

సమస్యలపై నేడు ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నేడు నరసరావుపేట లోని జిల్లా విద్యా శాఖ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. మోహనరావు బుధవారం ఒక ప్రకటనలో ఉపాధ్యాయులను కోరారు. ఆయన మాట్లాడుతూ 2011 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులను టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ నుంచి మినహాయించాలని, విద్యా హక్కు చట్టం లోని సెక్షన్ 23(1) కు తగిన సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. సింగిల్ టీచర్ గా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు సెలవులు మంజూరులో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించి, ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జిల్లా లోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గని ధర్నాను విజయవంతం పిలుపునిచ్చారు.

ఫార్మా-డి ఫలితాల్లో హిందూ కాలేజి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గుంటూరు


వి.గీతాకృష్ణ, వి.సరోజ అన్నపూర్ణ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రకటించిన ఫార్మా.డి. మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి. నాగ భూషణం తెలిపారు. 33 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 30 మంది డిస్టింక్షన్ లోను, ఇద్దరు ఫస్ట్‌క్లాస్‌లోనూ ఉత్తీర్ణత సాధించినట్లు తెలియచేశారు. 1100 మార్కు లకు గాను వెలగపూడి గీతా కృష్ణ 983 మార్కులతో ప్రథమ స్థానంలోను, వెలగల సరోజ అన్నపూర్ణ 980 మార్కులతో ద్వితీయ స్థానంలోను నిలిచా రన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ఫార్మా.డి.డైరెక్టర్ డాక్టర్ పి.సీతా రామయ్య, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, హెచ్ఓడి డాక్టర్ ఎన్.హేమకుమారి అభినందనలు తెలిపారు.

డ్రగ్స్ వినియోగం హానికరం


మాట్లాడుతున్న ఎస్పి బి.కృష్ణారావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళల కు శక్తి యాప్ వలన కలిగే ప్రయోజనాలు, రోడ్డు భద్రత నియమాలు మొదలగు వాటి పై విద్యార్థులకు పల్నాడు జిల్లా పోలీసు అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. నరసరావుపేట ఎస్.ఎస్.ఎన్ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం విద్యార్థులకు డ్రగ్స్, ట్రాఫిక్ రూల్స్, విద్యార్థినులకు, మహిళలకు శక్తి యాప్ వలన కలిగే ప్రయోజనాలు, ఉపయోగించే విధానాన్ని పల్నాడు జిల్లా ఎస్.పి బి.కఅష్ణారావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.ఎస్.పి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం - మానవ మనుగడకు హానికరమన్నారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మెలగాలని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా యువతలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాలపై అవగాహన పెంపొందించడమే లక్ష్య మన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేసి వారి సేవలు వినియోగిస్తామని తెలిపారు. కళాశాలలో విద్యార్థుల ప్రవర్తన, నడవడిక, చదువు తదితర అంశాలపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు నిఘా ఉంచాలని అన్నారు. ప్రస్తుత సమాజంలో 15 నుండి 30 ఏళ్ల వయసు కలిగిన తేలికగా మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు అలవాటు పడి మానసిక నియంత్రణ కోల్పోయి తమ వ్యసనాలను తీర్చుకోవడానికి నేర ప్రవృత్తి వైపు మళ్ళి నేరాలకు పాల్పడుతూ తమ భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని అన్నారు. తల్లిదండ్రులు - ఉపాధ్యాయులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలన్నారు. మహిళకు, విద్యార్థినులకు శక్తి యాప్ ఉపయోగాలు...ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బాలికల, మహిళల భద్రత కొరకు శక్తి యాప్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మైనర్లు వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. కావున వారికి ఎట్టి పరిస్థితులలో వాహనాలు ఇచ్చి ప్రోత్సహించరాదని తెలిపారు. ప్రస్తుత కాలంలో ప్రమాదాలు జరిగి చనిపోతున్న వారిలో ఎక్కువమంది హెల్మెట్ వాడక పోవడమే కారణమని తెలిపారు. అందువల్ల ద్విచక్ర వాహనాల మీద ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితులలో డ్రైవింగ్ చేయరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ డి.ఎస్.పి ఎం.హనుమంతరావు, మహిళా పోలీస్ స్టేషన్ డి.ఎస్.పి. ఎం.వెంకట రమణ, నరసరావుపేట 1వ పట్టణ సీఐ ఫిరోజ్, నరసరావుపేట 2వ పట్టణ సీఐ ప్రభాకర్, నరసరావుపేట రూరల్ సీఐ ఎంవి.సుబ్బారావు, ట్రాఫిక్ సిఐ లోకనాథం, కళాశాల కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, ఎన్.సి.సి మేజర్ బి.ఎస్. రామ కఅష్ణంరాజు, పోలీసు సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నజీర్ అహ్మద్ రచనలు భారతదేశానికి ఆదర్శనీయం

ప్రజాశక్తి-తెనాలిరూరల్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పసుపులేటి త్రిమూర్తి, ఖుద్దూస్, డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకి అండగా నిలిచిన ఫజులుల్లా ఖాన్, షేక్ మదీనా సేవలను తన పరిశోధనాత్మక గ్రంథాల ద్వారా తెలియపరిచిన సయ్యద్ నజీర్ అహ్మద్ రచనలు యావత్ భారతదేశానికి ఆదర్శనీయమని వక్తలు కొనియాడారు. స్థానిక వహాబ్ చౌక్ గ్రంథాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన అల్లూరికి అండగా నిలచిన ఫజులుల్లా ఖాన్- షేక్ మదీనా పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ పసుపులేటి త్రిమూర్తి పాల్గొన్నారు. అనంతరం పుస్తకావిష్కరణ చేసి తెనాలి నియోజకవర్గ టిడిపి పట్టణాధ్యక్షులు మహమ్మద్ ఖుద్దూస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ రహీమా, రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ మొహమ్మద్ ఇస్మాయిల్ భేగ్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ జాఖీర్, ఎపిడబ్ల్యూజెఎఫ్ డివిజన్ అధ్యక్షులు అంబటి శ్యామ్ సాగర్, కార్యక్రమ నిర్వాహకులు ఎస్ ఎస్ జహీర్ కు అందజేసారు. అల్లూరికి అండగా నిలిచిన ఫజులుల్లా ఖాన్-షేక్ మదీనా గ్రంథం ద్వారా చరిత్ర పుటల్లో మరుగునపడిన ఇద్దరు ముస్లిం యోధుల చరిత్రను తిరగరాసి ఈ తరానికి అందించిన గ్రంథకర్త సయ్యద్ నజీర్ అహ్మద్‌ను త్రిమూర్తులు అభినందించారు. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వంలో డిప్యూటి కలెక్టర్ గా విధులు నిర్వహించిన ఫజులుల్లాఖాన్ సీతారమరాజుకు సహకరించారని అలాగే అదే ప్రభుత్వంలో పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గా ఉద్యోగం చేసిన షేక్ మదీనా మన్యం వీరుడుకి తుపాకీ కాల్చడం నేర్పించ్చారన్న విషయాన్ని మహమ్మద్ ఖుద్దూస్ గుర్తు చేశారు. ప్రథమ భారత స్వాతంత్ర సంగ్రామంలో 1957 డిసెంబర్ 17న అమరులైన తొలి పత్రిక సంపాదకులు మౌలానా మహమ్మద్ భాకర్ స్మరణతో ఈ పుస్తక ఆవిష్కరణ చేసినట్లు ఎస్ఎస్ జహీర్ తెలిపారు. స్వతంత్ర సమరంలో ముస్లిం సోదరులు పాత్రలను గ్రంథం రూపంలో ప్రచురించిన నజీర్ అహ్మద్ గుంటూరు ప్రాంతానికి చెందినవారవ్వడం మనప్రాంతం చేసుకున్న సుకృతం అన్నారు.

ప్రజాశక్తి - గుంటూరు

స్వాతంత్ర్య ఉద్యమంలో ముస్లింల త్యాగాలు మరువలేనివని, 1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో 6 లక్షలకుపైగా ముస్లింలు ప్రాణాలు కోల్పోయారని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. బుధవారం జనచైతన్య వేదిక హాల్లో సయ్యద్ నసీర్ అహ్మద్ రచించిన 'అల్లూరికి అండగా నిలిచిన ఫజుల్లాఖాన్, షేక్ మదీనా ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ బ్రిటీషు ప్రభుత్వం హిందూ ముస్లింల మధ్య చిచ్చుపెట్టి పాలిస్తే నేడు మతోన్మాదులు మెజారిటీ వాదాన్ని ముందుకు తెచ్చి మైనార్టీల పట్ల వివక్షత చూపుతూ మరోసారి విభజన రాజకీయాలు చేస్తున్నారన్నారు. సయ్యద్ నసీర్ అహ్మద్ ముస్లింల త్యాగాల గురించి ఇప్పటికే 26 చారిత్రక గ్రంథాలు రచించి, ప్రజల్లో సోదర భావం పెంపొందించటానికి కృషి చేయటం అభినందనీయం అన్నారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ భారతీయత అంటే భిన్నత్వంలో ఏకత్వమని, భిన్న సంస్కృతుల వైవిధ్యమని అన్నారు. అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బ్రిటీషు కాలంలో తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఫజులుల్లాఖాన్ గ్రామంలో దేవాలయాన్ని నిర్మిస్తే ఆ గ్రామ ప్రజలు ఊరికి ఫజుల్లాబాద్‌గా నామకరం చేశారన్నారు. సాహితీ సంపాదకులు మోదుగుల రవికృష్ణ, పుస్తక రచయిత సయ్యద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ 30 ఏళ్లపాటు పనిచేసిన అనుభవం, రచయితగా రాణించేందుకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎల్లాప్రగడ మల్లిఖార్జునరావు, ప్రొఫెసర్ డిఎఆర్ సుబ్రహ్మణ్యం, బ్రైట్ హారిజన్ ఫౌండేషన్ చైర్మన్ ఎంకెఎస్ మొహిద్దీన్, జనచైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వివిఐటియులో యువజన ఉత్సవ ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - పెదకాకాని


పోస్టర్ను ఆవిష్కరిస్తున్న కులపతి వాసిరెడ్డి విద్యాసాగర్

మండల పరిధిలోని నంబూరు గ్రామంలో గల వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటి నందు డిశంబర్ 21,22 తారీఖులలో జాతీయస్థాయి యువజనోత్సవం "వివా వివిఐటియు 2కె25-26" నిర్వహించనున్నట్లు వివిఐటి విశ్వవిద్యాలయం ప్రో-ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు.విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని ప్రోత్సహిస్తూ వారిలో ఉన్న అపరిమిత సామర్థ్యాలు మరియు అంతర్గతశక్తిని గ్రహించాలని తెలియపరిచే విధంగా "యువర్ పొటెన్షియల్ ఈజ్ ఎండ్ లెస్ ద మ్యాజిక్ ఈజ్ ఇన్ యు" అనే నినాదంతో "యానిమి ఇన్ ద స్ట్రీట్ ఆఫ్ చైనా" నేపథ్యంలో ఈ యువజనోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ (శాక్) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించు, ఈ వేడుకలో విద్యార్థులలో దాగివున్న సఅజనాత్మకత, నైపుణ్యం, కళాత్మకతను వెలికితీసే విధంగా సాంకేతిక, క్రీడా, సాంస్కఅతిక విభాగాలలో 93 అంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ యువజనోత్సవానికి సంబంధించిన ప్రచార ప్రతులను విద్యార్థులతో కలసి విశ్వవిద్యాలయం ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రో-ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్, రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, విడుదల చేశారు. శాక్ విద్యార్థి తనువృద్ధి నవ్య మాట్లాడుతూ, వివిఐటి నిర్వహించు యువజనోత్సవం "వివా వివిఐటియూ" కు ప్రత్యేక గుర్తింపు ఉన్నదని, రెండు రోజులపాటు నిర్వహించు ఈ వేడుకలు విశ్వవిద్యాలయంలోని ఎన్.ఎస్.ఎస్, ఎన్.సి.సి, అప్పా స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థుల సహకారంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. యువజనోత్సవంలో పాల్గొనే వారు "వివా వివిఐటియు. కామ్" వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. యువజనో త్సవంలో పాల్గొనే విద్యార్థులకు గుంటూరు, విజయవాడ, తెనాలి ప్రాంతాల నుండి రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, అడ్మిషన్స్ డైరెక్టర్ డా.సి ఉదయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.